# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను
http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...
సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 282 మంగళవారం 14 మే 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# ఓటేసిన గ్రామీణం

- తీరుమారని నగరవాసులు
- తెలంగాణలో ముగిసిన పోలింగ్ సమయం...
- 17 లోక్ సభ నియోజకవర్గాలలో ముగిసిన పోలింగ్ సమయం
- చాలా ప్రాంతాల్లో రాత్రి వరకు పోలింగ్ కొనసాగే అవకాశం
- హైదరాబాద్‌లో స్వల్పంగానే ఓటింగ్ శాతం
- పట్టణ నియోజకవర్గాల్లో మాత్రం పోలింగ్ కనీసం 50 శాతం దాటలేదు
- హైదరాబాద్‌లో అయితే 39 శాతం మాత్రమే



హైదరాబాద్

తెలంగాణలో పోలింగ్ సమయం ముగిసింది. 17 లోక్ సభ నియోజకవర్గాలకు ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ముగిసింది. సాయంత్రం 6 గంటల లోపు క్యూలో నిలుచున్న వారికి ఓటు వేసేందుకు అవకాశం ఇస్తారు. క్యూలో నిలబడిన వారు ఓటు వేసేంతవరకు పోలింగ్ కొనసాగుతుంది. క్యూలో నిలుచున్న వారు చాలామంది ఉండటంతో కొన్ని ప్రాంతాల్లో రాత్రి వరకు పోలింగ్ కొనసాగే అవకాశాలు ఉన్నాయి. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటలకే ముగిసింది.ల తెలంగాణలో సాయంత్రం 5 గంటల వరకు 61 శాతం పోలింగ్ నమోదయింది. గ్రామీణ తెలంగాణలో పోలింగ్ శాతం దాదాపు 70 శాతం దాటింది. పోలింగ్ ప్రక్రియ పూర్తిగా ముగిసేసరికి 80 శాతం నుంచి 90 శాతానికి కూడా చేరుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. -మిగతా3లో



## దేశ భవిష్యత్తు.. మన బాధ్యత

- సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర ట్వీట్!
- ప్రతిఒక్కరూ ఓటు వేయాలని సీఎం రేవంత్ పిలుపు
- యువత తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచన
- ప్రజల హక్కుల పరిరక్షణ ఓటుతోనే సాధ్యమవుతుందని వ్యాఖ్య
- మన బాధ్యత నిర్వర్తించినప్పుడే హక్కుల కోసం ప్రశ్నించే అవకాశం ఉంటుందన్న రేవంత్ రెడ్డి

హైదరాబాద్

తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రారంభం కావడంతో ఓటు వేసేందుకు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఇప్పటివరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా జరుగుతోంది. ఇక రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర ట్వీట్ చేశారు. దేశ భవిష్యత్తు మన బాధ్యత.. ఓటు వేయడంపై నిర్లక్ష్యం వద్దని.. ప్రతిఒక్కరూ ఓటు వేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం ట్వీట్ చేసిన రేవంత్.. ప్రజాస్వామ్య రక్షణలో మీ పాత్ర పోషించాలి. యువతకు మరీ మరీ చెబుతున్నా.. మీ ఓటు హక్కు తప్పకుండా వినియోగించుకోండి అని సూచించారు. భారత ప్రజాస్వామ్యం పటిష్ఠంగా ఉండటానికి ఓటే పునాది అని అన్నారు. ప్రజల హక్కుల పరిరక్షణ ఓటుతోనే -మిగతా3లో



## టీఎస్ఆర్టీసీ మరో బంపరాఫర్

- ఇకపై వారంతా డీలక్స్ బస్సుల్లోనూ ప్రయాణించొచ్చు
- ఎక్స్‌ప్రెస్ మంత్లీ సీజన్ టికెట్ పాస్ తీసుకునే వారికి తీపికబురు
- ఎంఎస్టీ పాస్ కలిగిన వారు రూ.20 కాంబినేషన్ టికెట్ తీసుకొని డీలక్స్ బస్సులోనూ ప్రయాణించవచ్చు

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతోపాటు పలు కొత్త పథకాలను ప్రవేశపెడుతూ ఆకట్టుకుంటోంది. తాజాగా, టీఎస్ఆర్టీసీ మరో బంపరాఫర్ ప్రకటించింది. ఇది ఎక్స్‌ప్రెస్ మంత్లీ సీజన్ టికెట్ పాస్ తీసుకునే వారికి తీపికబురు అందించింది. ఎక్స్‌ప్రెస్ మంత్లీ సీజన్ టికెట్ పాస్ ఉన్నవారు ఇకపై డీలక్స్ బస్సుల్లో కూడా ప్రయాణించే వెసులుబాటును కల్పిస్తున్నట్లు టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ట్విట్టర్‌లో వెల్లడించారు. -మిగతా3లో

## జూన్ 5న జైలు నుంచి బయటకు వస్తా!

- ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కీలక వ్యాఖ్యలు..
- 'తిహార్‌లోని తన సెల్‌లో రెండు సీసీటీవీ కెమెరాలు ఉన్నాయి.
- మోదీకి తనపై ఎలాంటి పగ ఉందో నాకు తెలియదు
- బాత్‌రూమ్‌కి వెళ్లడానికి నేను రాత్రి ఏ సమయానికి లేస్తానో కూడా వారు పర్యవేక్షించే వారు'





## బీజేపీ 190 సీట్లకే పరిమితం

- మోదీని దీటుగా నిలువరిస్తాం
- ఇండియా కూటమి బీజేపీని నిలువరించేలా తాము బెంగాల్ నుంచే కూటమికి సాయం చేస్తాం
- విపక్ష ఇండియా కూటమి 315 స్థానాల్లో గెలుపొందుతుంది
- పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ధీమా

# తెలంగాణలో బీజేపీకి అత్యధిక స్థానాలు

- సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రంగా మండిపడిన కిషన్ రెడ్డి
- రేవంత్ రెడ్డి మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారని విమర్శ
- బీజేపీ అజెండాలో లేని అంశాలను కూడా తమపై రుద్దే ప్రయత్నం చేశారని ఆగ్రహం
- ఎక్కువ మంది ఏపీకి వెళ్లడంతో ఓటింగ్ శాతం తగ్గిందన్న కిషన్ రెడ్డి



హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలను కాంగ్రెస్ కార్యకర్తలు కూడా నమ్మడం లేదని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి ఎప్పుడూ మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారని... మాట్లాడితే ప్రధాని మోదీని ఛాలెంజ్ చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాళ్ల నాయకుడికే (రాహుల్ గాంధీ) దిక్కులేదని విమర్శించారు. తమస్థాయిని ఆలోచించి ప్రధానికి సవాల్ విసిరాలని సూచించారు. తమ అజెండాలో లేని అంశాలను కూడా తమపై రుద్దే ప్రయత్నం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేం వారిలో అబద్ధాలు చెప్పి ఓట్లను అడగలేమన్నారు. తెలంగాణలో పోలింగ్ సమయం ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... హైదరాబాద్‌లో కొంత పోలింగ్ శాతం తగ్గిందన్నారు. ఓటింగ్ శాతం తగ్గడానికి చాలా కారణాలు ఉన్నాయని తెలిపారు. ఎక్కువ మంది ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఓటు వేసేందుకు, ఓటింగ్ సరళని పరిశీలించేందుకు అక్కడకు వెళ్లారని తెలిపారు. అందుకే హైదరాబాద్‌లో ఓటింగ్ శాతం తగ్గిందన్నారు. బీజేపీకి తెలంగాణలో అత్యధిక స్థానాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీకే ఓటు వేస్తామని ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బాహాటంగా -మిగతా3లో

## ఓటు వేసిన సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్

- కొడంగల్‌లోని హైస్కూల్‌లో తమ ఓటు హక్కు వినియోగించుకున్న రేవంత్ రెడ్డి దంపతులు
- భార్య గీతా రెడ్డితో పాటు కూతురు నీమిషాతో కలిసి పోలింగ్ సెంటర్‌కు వెళ్లిన సీఎం
- అలాగే వేర్వేరు చోట్లలో ఓటు వేసిన పలువురు కాంగ్రెస్ నేతలు, మంత్రులు
- చింతమడకలో ఓటు వేసిన మాజీ సీఎం కేఆసీర్ దంపతులు




హైదరాబాద్

నాలుగో దశ లోక్‌సభ ఎన్నికలలో భాగంగా తెలంగాణలో పోలింగ్ కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు కొడంగల్‌లోని హైస్కూల్‌లోని పోలింగ్ బూత్‌లో తమ ఓటు వేశారు. రేవంత్ తన భార్య గీతా రెడ్డితో పాటు కూతురు నీమిషాతో కలిసి పోలింగ్ సెంటర్‌కు వెళ్లి ఓటు వేశారు. అలాగే పలువురు కాంగ్రెస్ నేతలు, మంత్రులు కూడా తమ హక్కు వినియోగించుకున్నారు.

# కాంగ్రెస్‌కు టెంపోలో డబ్బులు పంపి ఉంటే
# అదానీ, అంబానీని అరెస్ట్ చేయండి

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి కౌంటర్ ఇచ్చారు. అదానీ, అంబానీల నుంచి కాంగ్రెస్‌కు టెంపోల నిండా డబ్బులు అంది ఉంటాయన్న మోదీ వ్యాఖ్యలను ఆయన తిప్పికొట్టారు. చాలా ధైర్యమైన బీజేపీ ప్రభుత్వం అదానీ, అంబానీలను ఎందుకు అరెస్టు చేయలేదు? అని ప్రశ్నించారు. 'మీరు హేమంత్ సోరెన్‌ను అరెస్ట్ చేశారు. అదానీ, అంబానీలను ఎందుకు అరెస్టు చేయడం లేదు' అని మల్లికార్జున్ ఖర్గే అన్నట్లు పీటీఐ వార్తా సంస్థ పేర్కొంది. కాగా, ప్రధాని మోదీ ప్రభుత్వం పాలసీలు రూపొందించినప్పుడు అదానీ సహా కొంత మంది పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా వ్యవహరించినట్లు రాహుల్ గాంధీ విమర్శించారు. రైతుల సంక్షేమాన్ని పణంగా పెట్టి పారిశ్రామికవేత్తల రుణాలను కేంద్ర ప్రభుత్వం మాఫీ చేసిందని గతంలో ఆరోపించారు. మరోవైపు ఇటీవల తెలంగాణాలో ఎన్నికల ప్రచారం సందర్భంగా రాహుల్ గాంధీపై ప్రధాని మోదీ విరుచుకుపడ్డారు. 'కాంగ్రెస్ యువరాజు ఐదేళ్లుగా పదే పదే ఒక విషయం చెబుతున్నారు. రాఫెల్ ఇష్యూ తెరమరుగయ్యాక ఐదుగురు పారిశ్రామిక వేత్తలను, ముఖ్యంగా అంబానీ, అదానీలను లక్ష్యంగా చేసుకున్నారు. అయితే ఎన్నికల షెడ్యూల్ ప్రకటించగానే వారిపై దాడులు చేయడం మానేశారు. కాంగ్రెస్‌కు టెంపో లోడ్లు (కరెన్సీ) చేరాయా? అని నేను అడగాలనుకుంటున్నా. రాత్రికి రాత్రే అంబానీ, అదానీపై యువరాజు ఆరోపణలు ఆగిపోవడానికి ఏ డీల్ జరిగింది' అని మోదీ ప్రశ్నించారు.



## రాజకీయ ఉద్రిక్తతల మధ్య బాంబు పేలుడు



**తిరువనంతపురం:** రాజకీయ ఉద్రిక్తతల నడుమ కేరళ లోని కన్నూరు జిల్లాలో సోమవారం ఉదయం బాంబు పేలుడు ఘటన అందర్నీ ఉలిక్కిపడేలా చేసింది. అయితే, ఈ పేలుడులో ఎవరూ గాయపడకపోవడంతో పోలీసు యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. చక్కరక్కాల్ సమీపంలోని బవాడె ప్రాతంలో ఈ పేలుడు సంభవించిందని, ఆ సమయంలో అక్కడికి సమీపంలోనే పోలీసు సిబ్బంది మోహరించి ఉన్నట్టు అధికారులు తెలిపారు. వెంటనే అక్కడకు చేరుకున్న బాంబ్ స్క్వాడ్ గాలింపు చర్యలు చేపట్టిందని, బాంబు విసిరిందెవరనే విషయం ఇంకా నిర్ధారణ కాలేదని చెప్పారు. కాగా, పేలుడు పదార్థం ఐస్‌క్రీ బాల్ కంటైనర్ల రూపంలో ఉన్నట్టు పేరు వెల్లడించడానికి నిరాకరించిన పోలీసు అధికారులు తెలిపారు. ఆదివారంనాడు జరిగిన ఒక టెంపుల్ ఫెస్టివిల్ సందర్భంగా సీపీఎం, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ తలెత్తిందని, ఈ క్రమంలో స్వల్ప తీవ్రతతో సోమవారం ఉదయం జరిగిన బాంబు పేలుడు కలకలం సృష్టించిందని చెబుతున్నారు. తాజా ఘటనపై చక్కరక్కాల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ముంబైలో దుమ్ము తుఫాన్.. నగరాన్ని తాకిన తొలి చినుకు



ముంబై: ముంబైలో ఇవాళ మధ్యాహ్నం భారీ ఎత్తున దుమ్ము తుఫాన్ వచ్చింది. దీంతో ఆకాశం నల్లగా మారిపోయింది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో.. ముంబైలో దుమ్ము విపరీతంగా లేచింది. వెదర్‌లో ఆకస్మికంగా వచ్చిన మార్పులతో.. నగరంలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. కొన్ని ప్రాంతాల్లో బలమైన గాలులు వీచాయి. కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఘాట్ కోపర్, బంద్రా కుర్లా, ధారావి ప్రాంతాల్లో వాతావరణం భీకరంగా మారింది. పాల్గర్, థానే ప్రాంతాల్లో మెరుపులు, ఉరుములతో కూడిన వర్షం పడింది. ఆ ప్రాంతంలో గంటకు 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. కొన్ని ప్రాంతాల్లో భీకర గాలుల వల్ల చెట్లు నేలకూలాయి. ఆరోలి సెక్టర్ 5 ఏరియాలో ఉన్న రోడ్డుపై ఓ భారీ వృక్షం పడిపోయింది. దీని వల్ల అక్కడ ట్రాఫిక్ నిలిచిపోయింది.

# 'ఆప్' ఎంపీ స్వాతి మలివాల్‌పై
# సీఎం సిబ్బంది దాడి!



**న్యూఢిల్లీ:** సార్వత్రిక ఎన్నికల నాలుగో విడత పోలింగ్ వేళ ఢిల్లీలో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వ్యక్తిగత సిబ్బంది తనపై దాడి చేసినట్టు ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ స్వాతి మలివాల్ ఆదివారంనాడు ఆరోపించారు. దీనిపై ఢిల్లీ పోలీసులు వెంటనే స్పందించారు. స్వాతి మలివాల్ పేరుతో తమకు పీసీఆర్ కాల్ వచ్చినట్టు ధ్రువీకరించారు. సీఎం హౌస్ వద్ద తనపై దాడి జరిగినట్టు సివిల్ లైన్స్ పీఎస్‌కు ఒక మహిళ నుంచి కాల్ వచ్చిందని, ఆ తర్వాత కొద్దిసేపటికి ఎంపీ మేడం (స్వాతి మలివాల్) పోలీస్ స్టేషన్‌కు వచ్చారని డీసీపీ (నార్త్) మనోజ్ మీనా తెలిపారు. తర్వాత ఫిర్యాదు ఇస్తానంటూ ఆమె వెంటనే వెళ్లిపోయినట్టు తెలిపారు. కాగా, లాంఛనంగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఉదయం 10 గంటల ప్రాంతంలో తమకు రెండు ఫోన్ కాల్స్ వచ్చాయని సివిల్ లైన్స్ పోలీసులు తెలిపారు. వెంటనే సీఎం నివాసానికి తమ పోలీస్ టీమ్ వెళ్లిందని, అయితే ప్రోటోకాల్ ప్రకారం లోపలకు వెళ్లలేదని వారు చెప్పారు. కాగా, తనపై దాడి జరిగినట్టు స్వాతి మలివాల్ చేసిన ఆరోపణలపై సీఎం రెసిడెన్స్ నుంచి కానీ అధికార ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి కానీ వెంటనే ఎలాంటి స్పందన రాలేదు. స్వాతి మలివాల్ ఈ ఏడాది జనవరిలో రాజ్యసభ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. రాజ్యసభకు పార్టీ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

## మోదీ ప్రసంగాలపై పిటిషన్‌ను
# తోసిపుచ్చిన ఢిల్లీ హైకోర్టు



**న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికల్లో "మతపరమైన విభజన ప్రసంగాలు" చేయడం ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమా వళిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉల్లంఘించారని, ఆయనపై చర్యలకు ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు సోమవారం నాడు తోసిపుచ్చింది. పిటిషన్‌లో ఎలాంటి మెరిట్ లేదని, విచారణకు అర్హమైనది కాదని జస్టిస్ సచిన్ దత్తా తీర్పునిచ్చారు. పిటిషనర్లు చేసిన ఫిర్యాదును చట్టానికి అనుగుణంగా స్వతంత్రంగా అంచనా వేసి చర్య తీసుకునే అధికారం ఎన్నికల కమిషన్‌కు అందని కోర్టు స్పష్టం చేసింది. పిటిషన్‌లో ఎలాంటి మెరిట్ లేదనందున తోసిపుచ్చుతున్నట్టు పేర్కొంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు పాల్పడినట్టు ముందుగానే పిటిషనర్ ఒక నిర్ణయానికి రావడం పూర్తిగా అనుచితమని కూడా కోర్టు తెలిపింది. ప్రధాన మంత్రి, ఇతర బీజేపీ నేతల విద్వేష ప్రసంగాలపై ఈసీకి ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని పిటిషనర్లు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. రాజస్థాన్‌లోని బన్స్వారాలో ఈనెల 21న ప్రధానమంత్రి చేసిన ప్రసంగాన్ని వారు ప్రస్తావించారు. షహీన్ అబ్దుల్లా, అమితబ్ పాండే, దేబ్ ముఖర్జీ అనే ముగ్గురు హైకోర్టులో ఈ పిటిషన్ వేశారు. విద్వేష ప్రసంగాలు చేసిన రాజకీయ నేతలపై ఎఫ్ఐఆర్ నమోదుతో సహా తక్షణ చర్యలు తీసుకునేలా ఈసీఐని ఆదేశించాలని కోర్టును వారు కోరారు.

# ఈవీఎంలను ఎక్కడికి తరలిస్తారు..
# 5 ఏళ్ల వరకు వాటికి భద్రత ఎందుకు?



**హైదరాబాద్:** దేశ వ్యాప్తంగా లోక్ సభ ఎన్నికలు పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. అయితే పోలింగ్ ముగిశాక ఈవీఎం మిషన్లను ఏం చేస్తారనే సందేహం మీకెప్పుడైనా వచ్చిందా. ఈవీఎంల భద్రత ఎలా ఉంటుంది, రీకౌంటింగ్‌కు పట్టుబడితే పరిస్థితి ఏంటి తదితర వివరాలు తెలుసుకుందాం. పోలింగ్ పూర్తైన వెంటనే ఈవీఎం యంత్రాలను పటిష్ట బందోబస్తు నడుమ స్ట్రాంగ్ రూంలో భద్రపరుస్తారు. ఈవీఎం గదులు ఉన్న పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. ఈవీఎం ఉన్న గదులకు మూడంచెల భద్రత ఉంటుంది. పోలింగ్‌లో ఉపయోగించిన ఈవీఎం, వీవీ ప్యాట్ మిషన్లు, పోస్టల్ బ్యాలెట్ పేపర్లతో పాటు పలు విలువైన పత్రాలను ఐదేళ్ల వరకు భద్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటారు. వీటన్నింటిని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రిటర్నింగ్ అధికారులు స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచి సీల్ చేస్తారు. ఎన్నికల ఫలితాలు వెల్లడించిన నాటి నుంచి 45 రోజుల పాటు జిల్లా ఎన్నికల అధికారి అధ్వర్యంలో భద్రత కల్పిస్తారు. ఈవీఎంల భద్రతకు ఎన్నికల సంఘం అధికారులు స్ట్రాంగ్ రూంలలో పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తారు. ఈవీఎంల కంట్రోల్ యూనిట్లను నిరంతరం పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాలతో పాటు కేంద్ర బలగాలు రక్షణ కల్పిస్తాయి. గడువు ముగిసిన తర్వాత ఎన్నికల సంఘానికి అప్పగించి గోదాములకు తరలిస్తారు. ఇక అక్కడ మళ్లీ ఎన్నికల వరకు అంటే ఐదేళ్ల పాటు భద్రంగా నిల్వ చేస్తారు. ఐదేళ్ల కాలపరిమితి ముగిసిన తర్వాత ఆయా యంత్రాల్లో డేటాను తొలగించి ఎన్నికల సంఘం అవసరానికి అనుగుణంగా దేశంలో ఎక్కడైనా తిరిగి మళ్లీ ఉపయోగిం చుకుం టారు. 5 ఏళ్ల పదవీకా లంలో గెలిచిన అభ్యర్థులపై ఓడిపోయిన అభ్యర్థులు ఆరోపణలు, ఫిర్యాదులు చేసే ఛాన్స్ ఉంటుంది. కొందరైతే పలు పోలింగ్ బూత్‌లలో రీకౌంటింగ్ జరపాలని న్యాయస్థానాలను ఆశ్రయిస్తుంటారు. కోర్టు లేదా ఎన్నికల సంఘం అదేశాలను అనుసరించి నిబంధనల మేరకు ఈ రీకౌంటింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. అందుకే 5 ఏళ్ల వరకూ ఈవీఎంలను భద్రపరుస్తారు.

## బీజేపీ 190 సీట్లకే పరిమితం..



కేంద్రంలో నరేంద్ర మోదీ సారధ్యంలోని కాషాయ కూటమిని మట్టికరిపించి విపక్ష ఇండియా కూటమిని అధికారంలోకి తీసుకొస్తామని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. ఇండియా కూటమి బీజేపీని నిలువరించేలా తాము బెంగాల్ నుంచే కూటమికి సాయం చేస్తామని చెప్పారు. తనకు అందిన సమాచారం ప్రకారం ఎన్డీయే కేవలం 190 నుంచి 195 స్థానాలకే పరిమితమవుతుందని, విపక్ష ఇండియా కూటమి 315 స్థానాల్లో గెలుపొందుతుందని అన్నారు. ఉత్తర 24 పరగణాల జిల్లా బన్గావ్‌లో దీదీ లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మోదీ సర్కార్‌కు భంగపాటు తప్పదని ఆమె పేర్కొన్నారు. విపక్ష ఇండియా కూటమి కేంద్రంలో అధికార పగ్గాలు చేపడుతుందని దీదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

## జూన్ 5న జైలు నుంచి బయటకు వస్తా..!



లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి గెలిస్తే.. జూన్ 5న తిహార్ జైలు నుంచి విడుదలవుతానని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఢిల్లీ అమ్ ఆద్మీ పార్టీ కౌన్సిలర్లనుద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మద్యం పాలసీ కేసులో అరెస్టయిన అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. మళ్లీ జూన్ 2న లొంగిపోవాలని సూచించిన విషయం తెలిసిందే. ఆయన మాట్లాడుతూ 'తిహార్‌లోని తన సెల్‌లో రెండు సీసీటీవీ కెమెరాలు ఉన్నాయి. ఫీడ్‌ను 13 మంది అధికారులు పర్యవేక్షించారు. సీసీటీవీ ఫీడ్‌ను పీఎంవోకు సైతం అందించారు. మోదీ సైతం పర్యవేక్షిస్తున్నారు. మోదీకి తనపై ఎలాంటి పగ ఉందో నాకు తెలియదు. బాత్‌రూమ్‌కి వెళ్లడానికి నేను రాత్రి ఏ సమయానికి లేస్తానో కూడా వారు పర్యవేక్షించే వారు' అన్నారు. కేజ్రీవాల్ డిప్రెషన్‌లో లేరని.. తనకు హనుమంతుడి ఆశీస్సులు ఉన్నాయని వారికి చెప్పాలనుకుంటున్నానన్నారు. తాను జూన్ 2న తిహార్ జైలుకు వెళ్లినప్పటికీ.. జూన్ 4న జైలులోనే ఫలితాలను చూస్తానన్నారు. ఇండియా కూటమి గెలిస్తేనే జూన్ 5న మళ్లీ బయటకు వస్తానన్నారు. మనం ఇప్పుడు కష్టపడకపోతే మళ్లీ ఎప్పుడు కలుస్తామో తెలియదన్నారు.

## ఇక త్వరగా పెళ్లి చేసుకోక తప్పేలా లేదు



రాహుల్ గాంధీ పెళ్లి ఎప్పుడు చేసుకుంటారనే విషయంపై సరదాగా స్పందించారు. జనం దీనిని ప్రస్తావించగా.. ఇక పెళ్లి చేసుకోక తప్పేలా లేదని పేర్కొన్నారు. సోమవారం ఉత్తరప్రదేశ్ లోని రాయబరేలీలో నిర్వహించిన లోక్ సభ ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ మాట్లాడారు.


**తల్లి స్థానంలో రాహుల్ పోటీ..**

ఇప్పటికే కేరళలోని వయనాడ్ ఎంపీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన రాహుల్ గాంధీ.. ఐదో దశలో ఎన్నిక జరగనున్న రాయబరేలీలో కూడా కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఇది చాలా ఏళ్లు కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం కావడం విశేషం. ఇప్పుడు అక్కడ రాహుల్ పోటీ చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ప్రియాంక గాంధీతో కలసి ఆయన రాయబరేలీలో ఎన్నికల ప్రచారం చేశారు.

**పెళ్లి ఎప్పుడు చేసుకుంటారనే నినాదాలతో..**

రాయబరేలీ సభలో బీజేపీ పార్టీ, ఎన్డీయే సర్కారు విధానాలపై రాహుల్ గాంధీ తీవ్రంగా విరుచుకుపడ్డారు. బీజేపీ రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ క్రమంలో రాయబరేలీతో తమ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. గతంలో ఇందిరాగాంధీ, ఇటీవలి వరకు సోనియాగాంధీ ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేశారని.. ఇది తమకు కర్మ భూమి అని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే సభకు హాజరైన కొందరు జనం.. రాహుల్ గాంధీ ఎప్పుడు పెళ్లి చేసుకుంటారంటూ ప్రశ్నించారు. అప్పటిదాకా సీరియస్ గా సాగిన ప్రసంగాన్ని ముగిస్తూ.. రాహుల్ దీనిపై స్పందించారు. "ఇప్పుడిక నేను త్వరలో పెళ్లి చేసుకోక తప్పేలా లేదు (అబ్ జల్దీ హి కర్నీ పడేగీ) " అని నవ్వుతూ వ్యాఖ్యానించారు. ఆ సమయంలో పక్కనే ఉన్న ప్రియాంకా గాంధీ కూడా నవ్వుతూ కనిపించారు.

## జూన్ 4 లోగా షేర్లు కొనిపెట్టుకోండి..



జూన్ 4వ తేదీలోగా స్టాక్ మార్కెట్లో షేర్లు కొనిపెట్టుకోవాలని, ఎందుకంటే ఆ తర్వాత మార్కెట్ బాగా పుంజుకుంటుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి తగిన మెజారిటీ రాదన్న అంచనాలతోనే స్టాక్ మార్కెట్లు పడిపోతున్నాయన్న ప్రచారంపై ఆయన ఈ విధంగా స్పందించారు. జాతీయ మీడియా సంస్థ ఎన్డీ టీవీకి సోమవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన కీలక అంశాలపై మాట్లాడారు.

**మార్కెట్లు భారీగా పెరుగుతాయి..**

స్టాక్ మార్కెట్ల పతనంపై అమిత్ షా స్పందిస్తూ.. "నిజానికి స్టాక్ మార్కెట్లు పడిపోవడానికి ఎన్నికలకు ముడిపెట్టవద్దు. ఇంతకు ముందు 16 సార్లు మార్కెట్లు భారీగా కరెక్షన్లకు గురయ్యాయి. ఇప్పుడు బీజేపీకి సీట్లు తగ్గుతాయన్న వదంతులు ఎన్ని వ్యాప్తి చెందినా సరే.. నేను సూచిస్తున్నది ఏమిటంటే.. జూన్ 4వ తేదీలోగా స్టాక్ మార్కెట్లో షేర్లు కొని పెట్టుకోండి. స్టాక్ మార్కెట్లు భారీగా పెరుగుతాయి.." అని పేర్కొన్నారు.

**స్థిరమైన ప్రభుత్వం వస్తుంది కాబట్టే..**

స్టాక్ మార్కెట్లకు ఎన్నికలకు సంబంధం లేకున్నా.. స్థిరమైన ప్రభుత్వం ఏర్పడితే మంచి పనితీరు ఉంటుందని అమిత్ షా చెప్పారు. "మాకు 400కు పైగా ఎంపీ సీట్లు వస్తాయి. స్థిరమైన మోదీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది. దీనితో షేర్ మార్కెట్ కూడా పెరుగుతుంది.." అని పేర్కొన్నారు. బీజేపీ, దాని మిత్ర పక్షాలు భారీగా సీట్లు సాధించడం ఖాయమన్నారు.

# ఓటేసిన గ్రామీణం...

-మొదటి పేజీ తరువాయి

కానీ హైదరాబాద్, మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్ వంటి పట్టణ నియోజకవర్గాల్లో మాత్రం పోలింగ్ కనీసం 50 శాతం దాటలేదు. హైదరాబాద్‌లో అయితే 39 శాతం మాత్రమే నమోదయింది. సికింద్రాబాద్‌లో 42 శాతం, మల్కాజ్‌గిరిలో 46 శాతం నమోదయింది. క్యూలైన్లో ఉన్న వారు ఓటేసినప్పటికీ 50 శాతం నుంచి 60 శాతం దాటేలా కనిపించడం లేదు. హైదరాబాద్‌లో ప్రతిసారి ఓటింగ్ తక్కువగానే నమోదవుతూ వస్తోంది. తెలంగాణలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగిసింది. సాయంత్రం 4 గంటలకు క్యూలైన్లలో నిల్చున్న వారందరికీ ఓటేసేందుకు అధికారులు అవకాశం కల్పిస్తున్నారు. మిగిలిన 106 అసెంబ్లీ సెగ్మెంట్లలో సాయంత్రం 6 గంటలకు పోలింగ్ కొనసాగనుంది.
మహబూబాబాద్, పెద్దపల్లి, ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని సమస్యాత్మకమైన 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై.. సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. సిర్పూర్, ఆసిఫాబాద్, చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల, మంథని, భూపాలపల్లి, ములుగు, పినపాక, ఇల్లెందు, భద్రాచలం, కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రక్రియ ముగిసింది.

**తెలంగాణలో పోలింగ్ శాతం పెరిగింది**

తెలంగాణ ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) వికాస్ రాజ్ రాష్ట్రంలో జరుగుతున్న పోలింగ్‌పై మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ శాతం బాగానే



ఉందని తెలిపారు. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం 50 దాటింది. ఇక హైదరాబాద్‌లో మాత్రం ఎప్పటిలానే ఈసారి కూడా తక్కువగానే 20 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా జరుగుతుందని చెప్పారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరుగుతుందని వికాస్ రాజ్ వెల్లడించారు. ఇక రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి పోలింగ్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు జరగనుంది. మధ్యాహ్నం ఒంటి గంట వరకే తెలంగాణలో 40 శాతానికి పైగా పోలింగ్ పర్సంటేజ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. దీంతో 2019తో పోలిస్తే ఈసారి పోలింగ్ శాతం భారీగా పెరిగే అవకాశం ఉందని సమాచారం.

# మందుబాబులకు ఝలక్ ఇచ్చి సిటీ పోలీసులు

హైదరాబాద్‌లో పోలింగ్ ముగిసిపోయింది. 6 గంటల దాటింది కాబట్టి వైన్స్ ఓపెన్ చేస్తారు. మంచిగా వైన్స్‌కి వెళ్లి లిక్కర్ సేవిద్దాం అనుకుంటన్న మందుబాబులకు ఊహించని ఝలక్ ఇచ్చారు హైదరాబాద్ పోలీసులు. వాస్తవానికి మే 11వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి.. మే 13 సాయంత్రం 6 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైన్ షాపులు, బార్లు మూసేయాలని తొలుత ఎన్నికల సంఘం ఆదేశాలు ఇచ్చింది. లిక్కర్ షాపులతో పాటుగా వివిధ జిల్లాలు, నగరాల్లో బార్లు, కల్లు కాపౌండ్ కూడా క్లోజ్ చేయాలని సూచించింది. దీంతో గత రెండ్రోజులుగా మందుబాబులు చుక్క దొరక్క అల్లాడిపోతున్నారు. సోమవారం సాయంత్రం షాపులు ఓపెన్ అవుతాయి కదా అని ఆత్రంగా ఎదురుచూస్తున్నారు. ఇంతలోనే హైదరాబాద్ నగరంలో మందుబాబులకు పోలీస్ కమిషనర్ ఝలక్ ఇచ్చారు. జంట నగరాల్లో సోమవారం పోలింగ్ ముగిసిన తర్వాత కూడా వైన్ షాపులు, బార్లు తెరవటానికి వీల్లేదని స్పష్టం చేశారు. మే 13 రోజంతా దుకాణాలు మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎండల నేపథ్యంలో పోలింగ్ ప్రక్రియను సాయంత్రం



5 గంటల నుంచి 6 గంటల వరకు పెంచారు. 6 గంటల లోపు క్యూలో నిలబడిన అందరికీ ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. ఈ క్రమంలోనే అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీపీ తెలిపారు. కాగా.. ప్రస్తుతం ఓ వైపు ఎండలు మండిపోతున్న క్రమంలో తెలంగాణలో బీర్లు విపరీతంగా తాగేస్తున్నారు. దీంతో బీర్లు అస్సలు దొరకడం లేదు. ఈ ఇష్యూపై మందుబాబులు ఆందోళన కూడా నిర్వహించారు. వేసవి తాపం తీర్చుకునేం దుకు చల్లని బీర్లు కూడా దొరకడం లేదంటూ తమ బాధను వెల్లిబుచ్చుతున్నారు. అంతలోనే ఎలక్షన్స్ రావడంతో.. లిక్కర్ షాపులు పూర్తిగా క్లోజ్ అయ్యాయి. దీంతో రోజూ మద్యం తాగే అలవాటు ఉన్న మందుబాబులు అల్లాడిపోతున్నారు. ఇక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో జూన్ 4న కూడా వైన్ షాపులు బంద్ కానున్నాయి.

## తెలంగాణలో బీజేపీకి అత్యధిక స్థానాలు



-మొదటి పేజీ తరువాయి

చెప్పారన్నారు. ఈసారి పట్టణప్రాంతవాసులే కాదు గ్రామాల్లోనూ బీజేపీకి ఓట్లు బాగా వేశారని పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ ఈసారి కొత్త శక్తిగా అవతరిస్తుందన్నారు. మోదీ మూడోసారి ప్రధాని అయ్యాక ఒక్కో హామీని అమలు చేస్తామన్నారు. మోదీని తీసుకువచ్చి సమ్మక్క సారక్క గిరిజన విద్యాలయాన్ని ప్రారంభిస్తామన్నారు. పార్టీని బలోపేతం చేసుకోవడంతో పాటు... కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై పోరాడుతూ... రెండంచెల వ్యూహంతో ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు.

# టీఎస్ఆర్టీసీ మరో బంపరాఫర్

-మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ఆర్టీసీ ఎండీగా బాధ్యతలు స్వీకరించినప్పటినుంచి వీసీ సజ్జనార్.. ఆర్టీసీ ఆదాయాన్ని పెంచేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ప్రతీసారి ఏదొక సరికొత్త ఆఫర్లు ప్రకటిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా, ఎంఎస్టీ పాస్ కలిగిన వారు రూ.20 కాంబినేషన్ టికెట్ తీసుకొని డీలక్స్ బస్సులోనూ ప్రయాణించవచ్చని సజ్జనార్ తెలిపారు. అయితే, ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన విషయమేమిటంటే.. ఈ ఆఫర్ ఎక్స్?ప్రెస్ మంత్లీ సీజన్ టికెట్ పాస్ ఉన్నవారికి మాత్రమే వర్తిస్తుందని




ఆర్టీసీ ఎండీ సజ్జనార్ స్పష్టం చేశారు. అయితే, ఎంఎస్?టీ పాస్ ఉన్న ప్రయాణికులు ఈ కాంబినేషన్ టికెట్ ఫెసిలిటీని సద్వినియోగం చేసుకొని డీలక్స్ బస్సులో ప్రయాణించాలని సజ్జనార్ సూచించారు. ఈ కాంబినేషన్ టికెట్‌తో రాష్ట్రంలో 100 కిలోమీటర్ల పరిధి వరకు రాష్ట్రంలో ఎక్కడైనా ప్రయాణించవచ్చు. అలాగే ఈ ఆఫర్ రాష్ట్రమంతా ఉన్న డీలక్స్ బస్సులకు వర్తిస్తుంది. ఆర్టీసీ అందిస్తున్న ఈ ఆఫర్?కోసం ఎక్స్?ప్రెస్ మంత్లీ సీజన్ టికెట్ పాస్ కావాలనుకునేవారు.. స్థానిక టీఎస్ఆర్టీసీ బస్ పాస్ కౌంటర్లకు వెళ్లి సంప్రదించాలని సజ్జనార్ సూచించారు. అయితే, టీఎస్?ఆర్టీసీ ప్రకటించిన ఈ సరికొత్త ఆఫర్ సమ్మర్ వరకే ఉంటుందా? లేదంటే ఆ తర్వాత కూడా కొనసాగుతుందా? అనే దానిపై ఆర్టీసీ స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతానికి ఆఫర్ కొనసాగుతోంది.

# ముంబైలో ఈదురుగాలులతో భారీ వర్షం...

ముంబైని ఈ సీజన్‌లో వర్షం పలకరించింది. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై చీకటిగా మారింది. ఉరుములు, మెరుపులతో... ఈదురుగాలులతో వర్షం కురిసింది. దీంతో ముంబై, ఆ చుట్టుపక్కల ప్రాంతాల వారికి ఉక్కపోత నుంచి ఉపశమనం లభించింది. వర్షం కారణంగా నగరంలో ట్రాఫిక్ జామ్ అయింది. ఘట్‌కోపర్, బాంద్రా కుర్లా, ధారావి ప్రాంతాల్లో బలమైన గాలులతో వర్షం కురిసింది. దేశంలో అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయాల్లో ముంబై ఒకటి. ఈదురుగాలులు, భారీ వర్షం నేపథ్యంలో ఇక్కడి నుంచి విమాన రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. తర్వాత సాయంత్రం 5.03 గంటలకు రాకపోకలను పునరుద్ధరించారు. వర్షం కురిసిన సమయంలో 15 విమానాలను దారి మళ్లించారు. ఘట్‌కోపర్‌లోని చెడ్డా నగర్ జంక్షన్‌లో 100 అడుగుల బిల్ బోర్డు కూలి సమీపంలోని పెట్రోల్ బంక్‌పై పడింది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. బిల్ బోర్డు కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు ఎన్డీఆర్ఎఫ్ రంగంలోకి దిగింది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా, 67 మంది గాయపడ్డారని తెలుస్తోంది. థానే, పాల్ఘర్, ముంబైలలో ఉరుములు మెరుపులతో కూడిన మోస్తరు నుండి భారీ వర్షాలు కురువవచ్చునని భారత వాతావరణ విభాగం హెచ్చరికలు జారీ చేసింది. పాల్ఘర్, థానే జిల్లాల్లో రానున్న మూడు నాలుగు గంటల్లో... 50 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో గాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురువవచ్చునని తెలిపింది. భారీ గాలులు, వర్షాల కారణంగా



ఆరే - అంధేరీ ఈస్ట్ మెట్రో స్టేషన్ల మధ్య రాకపోకలను నిలిపివేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

## ఓటు వేస్తూ ఫొటో దిగిన యువకుడిపై కేసు నమోదు

**హైదరాబాద్ :** తెలంగాణ వ్యాప్తంగా 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతున్నది. అక్కడక్కడ చెదురుముదురు సంఘటనలు మినహా సజావుగా కొనసాగు తున్నాయి. కాగా, జగిత్యాల జిల్లాలో ఓటు వేస్తూ ఓ యువకుడు ఫొటో తీసుకున్నాడు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గ్రామంలోని 8 పోలింగ్ బూత్‌లో చోటు చేసుకుంది. రెడ్డవేని జయరాజ్ అనే వ్యక్తి ఓటు వేస్తూ సెల్ఫీ తీసుకున్నాడు. ఎన్నికల అధికారి ఫిర్యాదు మేరకు పోలీసులు యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఓటు హక్కు నిశ్శబ్ద విప్లవానికి నాంది ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



**నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అలంపూర్ పట్టణంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలంపూర్ పట్టణంలోని పోలింగ్ బూత్ నంబర్ 272లో ఆర్ఎస్పీ ఓటేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. నాకు జన్మనిచ్చిన గడ్డ అలంపూర్‌లో తాను ఓటు హక్కును వినియోగించుకున్నాను. గ్రామాల్లో ఓట్ల పండగ వాతావరణం కనిపిస్తోంది. ఉదయాన్నే పోలింగ్ కేంద్రాలకు పెద్ద ఎత్తున ఓటర్లు తరలివస్తున్నారు. ఇదీ ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనం. ఓటు హక్కు నిశ్శబ్ద విప్లవానికి నాంది.ప్రజలే న్యాయ నిర్ణేతలుగా ఇచ్చే ఎన్నికల తీర్పులో భారత రాజ్యాంగం రక్షించబడాలి, ప్రజాస్వామ్యం ఫరిఢవిల్లాలి. మీరు కూడా మీ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోండి. ఓటు వేస్తున్న ప్రతి ఒక్కరికి తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు ఆర్ఎస్పీ.

## ఆ హక్కు నాకు ఉంది

**బురా తీసి ఐడీ కార్డ్ చెక్ చేయడంపై బీజేపీ అభ్యర్థి మాధవీలత**
**తాను లోక్ సభ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని పేర్కొన్న మాధవీలత**
**రిక్వెస్ట్‌గానే తాను ఐడీని చెక్ చేసినట్లు వెల్లడించిన బీజేపీ అభ్యర్థి**
**రెండు బూత్‌లలో మోసం జరుగుతోందని గుర్తించానని వ్యాఖ్య**



పోలింగ్ బూత్‌లో బురా వేసుకున్న మహిళల ఐడీ ప్రూఫ్ చెక్ చేసిన నేపథ్యంలో తనపై నమోదైన కేసు అంశం మీద హైదరాబాద్ లోక్ సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి కొంపెల్ల మాధవీలత స్పందించారు. తాను హైదరాబాద్ నుంచి లోక్ సభ అభ్యర్థిని అని... పైగా మహిళా అభ్యర్థిని అన్నారు. వారి ఫొటో ఐడెంటింటీని చెక్ చేసుకునే హక్కు తనకు ఉందన్నారు. తాను చాలా వినమ్రతగా 'అమ్మా, మీ ఫేస్... ఫొటో ఐడీని చెక్ చేసుకోండి' అని వారిని రిక్వెస్ట్ చేశానని పేర్కొన్నారు. ఆ సమయంలో తాను ఫేస్‌ను, ఫొటో ఐడీని చూశానన్నారు. రెండు బూత్‌లలో ఈవీఎంలను మార్చేశారని ఆరోపించారు. పోటీ చేసే అభ్యర్థిగా ప్రిసైడింగ్ ఆఫీసర్‌ను తీసుకెళ్లి చూపించడానికి తనకు మాత్రమే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే రెండు బూత్‌లలో మోసం చేస్తున్నారని.. దీనిపై ఎవరు మాట్లాడుతారని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఓటు వేసిన సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్

నాలుగో దశ లోక్‌సభ ఎన్నికలలో భాగంగా తెలంగాణలో పోలింగ్ కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు కొడంగల్‌లోని హైస్కూల్‌లోని పోలింగ్ బూత్‌లో తమ ఓటు వేశారు. రేవంత్ తన భార్య గీతా రెడ్డితో పాటు కూతురు నీమిషాతో కలిసి



పోలింగ్ సెంటర్‌కు వెళ్లి ఓటు వేశారు. అలాగే పలువురు కాంగ్రెస్ నేతలు, మంత్రులు కూడా తమ హక్కు వినియోగించుకున్నారు. ఇలా ఓటు వేసిన వారిలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి సీతక్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రావు, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నారు. వీరిలో కోమటిరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి నల్గొండలో ఓటు వేశారు. పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ బస్సులో వెళ్లి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. సూర్యాపేట జిల్లా కోదాడలో ఉత్తమ్, కల్లూరు మండలం నారాయణపూరంలో మంత్రి పొంగులేటి, ములుగు జిల్లా జగ్గన్నపేటలో మంత్రి సీతక్క, మధిరలో భట్టి విక్రమార్క గొల్లగూడెంలో మంత్రి తుమ్మల తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

**చింతమడకలో ఓటు వేసిన మాజీ సీఎం కేసీఆర్**

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చింతమడకలో ఓటు వేశారు. తన భార్య శోభతో కలిసి చింతమడక పోలింగ్ కేంద్రానికి వెళ్లి కేసీఆర్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అటు నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అలంపూర్‌లో ఓటు వేశారు. పట్టణంలోని హరిజనవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రవీణ్ కుమార్ తన ఓటు హక్కు వినియోగించుకున్నారు.

## 'దేశ భవిష్యత్తు.. మన బాధ్యత'..

-మొదటి పేజీ తరువాయి

సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఓటు మన హక్కు మాత్రమే కాదని, బాధ్యత కూడా అని సీఎం గుర్తు చేశారు. మన బాధ్యత నిర్వర్తించినప్పుడే హక్కుల కోసం ప్రశ్నించే అవకాశం ఉంటుంది అని రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు.

## సంపాదకీయం

# కేజ్రీ 'వాల్ ' అవుతారా

సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. మాములుగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసుల్లో బెయిల్ దొరకడం అనేది అసాధ్యం.. కానీ కేజ్రీవాల్ కేసును స్పెషల్‌గా తీసుకొని మరీ బెయిల్ ఇచ్చింది అత్యున్నత న్యాయస్థానం.. జూన్ 1 వరకు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. దీంతో తీహార్ నుంచి రిలీజ్ అయ్యారు కేజ్రీవాల్.. జైలుకు వెళ్లడానికి ముందే బీజేపీపై కత్తులు నూరారు కేజ్రీవాల్.. తనపై తప్పుడు కేసు నమోదు చేసి జైలుకు పంపారన్న కోపం పీక్స్‌లో ఉంది ఆయనకు.. అలాంటి కేజ్రీవాల్‌కు మళ్లీ బయటికి వచ్చి ఎన్నికల ప్రచారంలో పాల్గొనే చాన్స్ వచ్చింది. దీంతో ఇప్పుడు దేశ రాజకీయాల్లో మరింత స్పైస్ యాడ్ కానుంది. ఇక ఢిల్లీ లిక్కర్ పాలసీ స్కాంలో అరెస్ట్ అయ్యి, మధ్యంతర బెయిల్‌పై తీహార్ జైలు నుంచి విడుదలైన ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. తాజాగా ఇండియా కూటమి అధికారంలోకి వస్తే అమలు చేసే 10 గ్యారంటీలను ప్రకటించారు కేజ్రీవాల్.ఆదివారం ఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆప్ జాతీయ కన్వీనర్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 24 గంటల విద్యుత్, ఉచిత విద్య , ఢిల్లీకి పూర్తి రాష్ట్ర హోదాతో సహా పలు హామీలను ఇచ్చారు. భారత సరిహద్దు వెంబడి చైనా ఆక్రమించుకున్న భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంటామని హామీ ఇచ్చారు.తాను జైలులో ఉన్నందున ఈ పది హామీల ప్రకటన ఆలస్యమైందని కేజ్రీవాల్ అన్నారు. దేశంలో ఇంకా ఎన్నికలు మిగిలి ఉన్నాయన్నారు. ఈ హామీలపై తాను ఇతర ఇండియా కూటమి భాగస్వాములతో చర్చించలేదని.., అయితే ఎవరికీ ఎలాంటి ఇబ్బంది ఉండదని కేజ్రీవాల్ అన్నారు.ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ హామీలు అమలయ్యేలా చూస్తానని హామీ ఇస్తున్నానని కేజ్రీవాల్ అన్నారు.ముందుగా రాబోయే ఎన్నికల్లో కేజ్రీవాల్ ఎఫెక్ట్ ఏ మేరకు ఉంటుందో చూద్దాం.. మాములుగా కేజ్రీవాల్ ఎఫెక్ట్ ఉన్న రాష్ట్రాల లిస్ట్‌లో ఫస్ట్ ప్లేస్‌లో ఉండేది ఢిల్లీ.. ఆ తర్వా పంజాబ్, హర్యాణా? ఇక రాజస్థాన్, గోవాలో ఉన్నా.. అది చాలా తక్కువ.. సో మూడు రాష్ట్రాల్లో కేజ్రీవాల్ ఎఫెక్ట్ ఎక్కువే అని చెప్పాలి. ఇప్పటికే ఈ మూడు రాష్ట్రాల్లో ఆప్ జోరుగా ప్రచారం చేస్తుంది. ఇప్పుడా జోరు మరింత పెరగనుంది. ఢిల్లీలో కాంగ్రెస్‌తో ఆమ్ ఆద్మీ పార్టీ పొత్తు పెట్టుకుంది. ఇండియా కూటమిలో భాగంగా దేశ రాజధానిలోని ఏడు సీట్లలో ఆప్ నాలుగు.. మిగిలిన మూడు సీట్లలో కాంగ్రెస్ నుంచి అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రస్తుతం ఆయన రాజధానిపై ఫుల్ ఫోకస్ పెట్టనున్నారునెక్ట్స్ పంజాబ్.. ఇక్కడ 13 లోక్‌సభ సీట్లు ఉన్నాయి. ఇక హర్యాణాలో ప్రస్తుతం బీజేపీ అధికారంలో ఉంది. బట్ ఇప్పుడు కేజ్రీవాల్ ఎంట్రీతో ప్రచార స్టైల్ మారనుంది. అసలు కేజ్రీవాల్‌కు బెయిల్ వచ్చిన టైమింగ్ హైలేట్ అని చెప్పాలి. ఎందుకంటే ఆప్‌కు చివరి మూడు దశల పోలింగ్ చాలా ముఖ్యం.. మే 20, 25, జూన్ 1 వీటి పోలింగ్ ఉంది. ఢిల్లీ, హర్యానాల్లో ఆరో దశలో మే 25న.. ఆ తర్వాత పంజాబ్‌లో జూన్ 1న పోలింగ్ జరగనుంది. జూన్ 2న ఆయన తిరిగి తీహార్‌కు వెళ్లనున్నారు. సో పర్ఫెక్ట్ టైమ్‌లో బెయిల్ వచ్చింది కేజ్రీవాల్‌కు..కేజ్రివాల్ ఇక స్టేజ్ ఎక్కినా.. రోడ్ షో నిర్వహించినా.. దాని ఇంపాక్ట్ అంతా ఇంతా ఉండదు. ఇకపై అటు మోడీని ఇటు బీజేపీని చీల్చి చెండాడటం ఖాయం. ఇప్పటికే ఆయన ఈ పనిని మొదలు పెట్టారు. మరి ఈ పరిణామాలను ఎదుర్కోనేందుకు బీజేపీ ప్రిపేర్డ్‌గా లేదా? అంటే ఉందనే చెప్పాలి.. ఎందుకంటే.. జైలు నుంచి కేజ్రివాల్ బయటకు వస్తే ఆయనే సెంటరాఫ్ అట్రాక్షన్ అవుతారని బీజేపీకి కూడా తెలుసు. ఇప్పుడు బీజేపీకి ఒక్కటే చాయిస్ ఉంది. అది కేజ్రీవాల్ ఎదుర్కొంటున్న అవినీతి ఆరోపణలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం.. ఎట్ ది సేమ్ టైమ్.. ఆయన జైలు నుంచి వచ్చాడు.. మళ్లీ జూన్ 2న లొంగిపోవాలని సుప్రీం ఇచ్చిన ఆదేశాలను గుర్తు చేయడం.. బీజేపీ ఇదే టాపిక్‌పై ప్రచారం చేయనుంది.బట్ బీజేపీ ఈ స్ట్రాటజీని కేజ్రీవాల్ ఈజీగా ఓవర్‌కమ్ చేస్తారనిపిస్తోంది. ఎందుకంటే ఆయన ఓ మంచి వక్తి.. ఆయన ప్రచార స్టైల్ విద్య, ఉద్యోగం అన్నట్టుగా ఉంటుంది. నేను సామాన్యుడిని.. సామాన్యుల కోసమే పని చేస్తా అన్నట్టుగా సాగుతుంది ఆయన ప్రచారం. రియాల్టీ ఎలా ఉన్నా.. ఈ మధ్య ఎన్నికల ప్రచారంలో ఇదే ట్రేండ్.. దీనికి ప్రజలు ఈజీగా కనెక్ట్ అయ్యే చాన్స్ ఉంది. అంతేకాదు.. ఈ ఎన్నికలను కేజ్రీవాల్ ఓ రెఫరెండంగా భావించే చాన్స్ ఉంది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొని తీహార్ జైల్లో ఉన్నా కూడా.. ప్రజలు తనను ఓ వారియర్‌గా భావిస్తారన్న ఆశలో ఉన్నారు కేజ్రీవాల్.. అయితే దీనికి ఆన్సర్ అంత వెంటనే చెప్పలేము.. జూన్ 4 వరకు ఆగాల్సిందే..

# విశిష్టాద్వైత మతోద్ధారకుడు

రాజాదరణ పొంది ప్రాబల్యాన్ని సంతరించుకున్న జైన, బౌద్ధ, శైవ మతాలు స్థానిక ఆచార వ్యవహారాలలో కలసి, అనేకానేక శాఖలుగా విభజితాలై, వేర్వేరు సిద్ధాంతాలను ప్రతిపాదిస్తూ తమ శాఖలు గొప్పవని నొక్కి చెబుతూ, మూల ఉపనిషత్తుల సారాన్ని ప్రజలకు చేరువ చేయజాలని సమయాన, విశిష్టాద్వైతాన్ని ప్రతిపాదించి ఉద్ధరించారు శ్రీ రామానుజాచార్యులు. త్రిమతాచార్యులలో, ద్వితీయులైనా, కర్తవ్య నిర్వహణలో అద్వితీయులు. అసమాన ధైర్యాన్ని ప్రదర్శించి, సాటిలేని భక్తి తత్పరు నిగా తత్వవేత్తగా, ఆస్తిక హేతువాదిగా, పరమ యోగిగా, శంకర భగవత్పాదుల అద్వైత సిద్ధాంతం లోని దోషాలను సరిదిద్ది, నాటికి ప్రబల ప్రచారంలో ఉన్న సంప్రదాయాలన్నీ, దేవుడిని కొలవడానికి భిన్న మార్గాలే కాని, వైదిక మతానికి బదులుగా పాటించాల్సినవి కానే కాదని నొక్కి చెప్పిన ధీశాలి ఆయన. రామానుజులు జన్మించేనాటికి చోళులు, శైవ మతానుయాయులు అయినప్పటికీ, వైదిక మతాలను వ్యతిరేకించ లేదు. చాళుక్యులు శైవ మతస్తులు అయి ఉండి, తర్వాత జైన మతాన్ని ఆలపించారు. హొయసల రాజులు, జైన, వీరశైవ మతాలను ఆదరించారు. మౌర్యుల కాలానికి బౌద్ధం క్షీణ దశకు చేరుకుంది. మద్రాసుకు 30 మైళ్ళ దూరాన గల, శ్రీపెరుంబుదూరులో, హరిత గోత్రోద్భవులు, ఆపస్తంభ సూత్ర, యజుర్వేద శాఖాధ్యాయులు, శ్రీమాన్ అసూరి సర్వ క్రతు కేశవ సోమయాజి దీక్షితార్ మరియు కాంతిమతి దంపతులకు కలియుగ సంవత్సరం 4118 క్రీస్తు శకం1017 వైశాఖ శుక్ల పక్ష షష్ఠి గురువారం జనన మొందారు. కేశవ తన కుమారునికి, ప్రాథమిక విద్య స్వయంగా నేర్పగా, అనంతరం కాంచీపురానికి వెళ్లి యాదవ ప్రకాశుల వద్ద వేదాంతం అభ్యసించి, మూలానికి వ్యాఖ్యానం చేయడంలో గురు - శిష్యులకు భేదాభిప్రాయాలు కలువగా తమ విశిష్టాద్వైతాన్ని నెగ్గించుకున్నారు రామానుజులు. దీనితో గురువు కాశీకి కలసి తమతో పయనమైన, శిష్యుడిని చంపించే కుట్ర చేయగా, అది తెలుసుకుని, తప్పించుకొని కంచికి చేరారు. శ్రీరంగంలోని వైష్ణవ గురువైన అలవందారు, రామానుజుని ప్రతిభ గురించి విని శిష్యుడైన, పెరియ నంబిని పంపగా, వెనువెంటనే ఆయన పయనమయ్యారు. రామానుజుడు, శ్రీరంగం చేరే సమయానికి, ఆలవందారు తుది శ్వాస వదిలారు. భౌతిక దేహ వేళ్లలో, 3 విచిత్రంగా ముడుచుకొని ఉండడాన్ని గమనించారు. ఆయన మూడు కోరికలు తీరకుండా ఉండిపోయారని, అలవండారు శిష్యుల ద్వారా విని, మూడు కోరికలు అయిన, బ్రహ్మసూత్రాలకు, సహస్ర నామాలకు, తరువాయి మొళికి వ్యాఖ్యానాలు రాస్తామని, వాగ్దానం చేయడంతో మూడు వేళ్ళు తెరుచుకున్నాయని చెబుతారు. తర్వాత మధురాంతకంలో పెరియ నంబికి శిష్యులుగా మారారు. విద్యాభ్యాస సమయాన, తన భార్య గయ్యాళి తనం కారణంగా, గురువు శ్రీరంగం వెళ్లనందుకు నొచ్చుకున్న రామానుజులు, సంసార బంధం వీడి, సన్యాసాశ్రమం స్వీకరించారు. తిరు కోటి యార్ నంబి ప్రఖ్యాతి విని, తనను శిష్యునిగా స్వీకరించమని, ఆరు మార్లు ప్రాధేయ పడినా, ఫలితం లేక పోగా, ఏడవ సారి చేర బిలిచి, మంత్ర రహస్యం ఎవరికీ చెప్ప కూడదని వాగ్దానాన్ని పొంది, ఉపదేశం చేశారు. మోక్ష సంపాదనకు ఆ మంత్ర శక్తి సాధనం లేదని భావించి, ఒక వైష్ణవాలయం గోపురం ఎక్కి, గురువుకు చేసిన ప్రమాణాన్ని పక్కన పెట్టి, ఉపదే దేశిత మంత్రాన్ని, బహిరంగంగా ఎలుగెత్తి ప్రకటించారు. గురువు కోపంతో నరకానికి వెళతావు అని అన్నప్పుడు, జన సమూహానికి మోక్షం లభిస్తే, తాను ఒక్కడు నరకానికి వెళ్ళడానికి సిద్ధమని బదులు ఇచ్చారాయన. శిష్యుని ఉన్నత ఆదర్శానికీ, సంతోషించి, గురువు ఆశీర్వదించారు. అద్వైత వేదాంతి యగు, యజ్ఞమూర్తితో, శ్రీరంగంలో 16 రోజులు వాదించి, ఓడించగా, ఆయన శైవం పుచ్చుకున్నారు. బ్రహ్మసూత్రాలకు భాష్యం, వేదాంత సారం, వేదాంత దీపం, వేదాంత దీపిక, వేదార్థ సంగ్రహం శ్రీరంగ గద్యం, వైకుంఠ గద్యం, మొదలైన రచనలు చేశారు. తిరుపతి దేవస్థానంలో పూజాదికాలపై, తగాదా రాగా రామానుజులు మధ్యవర్తిగా ఉండి, వైష్ణవ ప్రాబల్యానికి కట్టుదిట్టం చేశారు. చేసిన వాగ్దానం ప్రకారం బ్రహ్మసూత్రాలకు వ్యాఖ్యానాలు రాయగా, పరాశర బట్టు చేత సహస్ర నామాలకు, తమ చుట్టమైన తిరుక్కురైప్పిరన్ చేత తిరువాయి మొలి మీద వ్యాఖ్యానాలు రాయించారు. కావేరీ తీర సాలిగ్రామం అనే చోట 12ఏళ్లు నివసించి, జైనులను ఓడించి, బిత్తి దేవుని వైష్ణవునిగా మార్చారు. చాత్తాద శ్రీవైష్ణవులు అమ్మంగార్ల కైంకర్యం చేసే సంప్రదాయాలను ఏర్పరిచారు. మేల్కోటలో, రామ ప్రియ అనే విగ్రహాన్ని తెప్పించి, ప్రతిష్టింపజేసి, రథోత్సవం నాడు ఆలయంలో పంచములకు ప్రవేశం కల్పించారు. శ్రీరంగంలో మత ప్రచారానికి 74 మంది శిష్యులను నియమించారు. వ్యాస సూత్ర భాష్యం గీతా భాష్యం, తర్క భాష్యం తదితరాలు రాయడం చేత "భాష్యకారుడు" అని త్రిదండి కావడం వల్ల "యతి రాజు" అని, "ఎంబరు మానారు" అని, లబ్ధ ప్రతిష్టులు అయినారు. రామానుజులు ఆనాటి ఆచార వ్యవహారాలు, చాందసంగా మారి, సామాజిక ప్రగతికి అడ్డు రాకముందే, గుర్తించి వాటిని, మానడమో, మార్చడమో చేయాలని కర్తవ్య నిర్దేశం చేశారు. గురువు చెప్పేదంతా గుడ్డిగా నమ్మక తర్కానికి గురిచేసి, తప్పో, ఒప్పో నిర్ణయించు కోవడం పాపం కాదని, హితవు పలికారు. సమాజ శ్రేయస్సు కన్నా, వ్యక్తిగత శ్రేయస్సు ముఖ్యం కాదని రామానుజులు నొక్కి చెప్పారు.

# సామాజిక సంస్కర్త పరశు రాముడు

భృగు వంశోద్భవుడు, జమదగ్ని మహర్షి కుమారుడు, సహస్ర బాహు డైన కార్త వీర్యార్జునుని సంహరించిన, మహా వీరుడు పరశు రాముడు. తండ్రి ఆజ్ఞానువర్తియై, కన్నతల్లిని హతమార్చి, తిరిగి తండ్రి ఆశీస్సులతో, పునరుజ్జీవితు రాలిగా చేసిన ధర్మవీరుడు. భూ భారాన్ని తగ్గింప, భార్గవ రాముని రూపంలో ఉదయించాడు శ్రీహరి. అనులోమ సంజాతుడు అయి, బ్రాహ్మణుడగు జమదగ్నికి, క్షత్రియురాలగు రేణుకకు జన్మించి బ్రాహ్మణ, క్షత్రియ వివాదాలను గొడ్డలితో తీర్చి, ఆటవికులకు యజ్ఞోపవీత ధారణ గావించి, బ్రాహ్మణులుగా మార్చిన అసామాన్య సామాజిక సంస్కర్త పరశు రాముడు. అంతేకాదు బ్రాహ్మణ పక్షపాతియై, క్షత్రియులను అనేకులను సహకరించిన పరశు రాముడు, "మీరెన్ని దానములు పట్టినను, ఎంతగా కష్టపడిననూ, విద్య వచ్చును గాని, ధనము రాదని, వచ్చిననూ అది నిలువ ఉండదని", బ్రాహ్మణ కులానికి శాపమిచ్చినట్లుగా కథనం ఉంది. ఆజన్మాంతం క్షత్రియ కులాన్ని నిర్మూలించిన పరశు రాముడు, క్షత్రియుడు అయిన శ్రీరాముని చేతిలో ఓడిపోవడం, శివ ధనుస్సు విరిచి, వివాహితుడై వస్తున్న దశరథ రాముని, ఎదిరించి, భంగ పడడం, విష్ణువు యొక్క ఒక ఒక అవతారం చేత, మరొక అవతారం ఓడింప బడిన సందర్భం ప్రత్యేకం. పరశు రామా! దశరథ రాముడి సందర్శనం అయ్యాక, నీవు శస్త్రం పట్టవద్దు. ఎందుకంటే నీ వైష్ణవ తేజస్సు అతనిలో ప్రవేశిస్తుంది. అది సురకార్యం నిర్వహిస్తుంది. అని శంకరుడు పరశు రామునికి లోగడ చెప్పడమే దీనికి కారణం అని పురాణ కథనం.

విష్ణువు దశావతారాలలో ఆరవది పరశు రామావతారం. పురుషార్థ చంద్రిక, నిర్ణయ సింధు, గ్రంథాలు అక్షయ తృతీయ "పరశురామ జయంతి" పేర్కొంటున్నాయి. శ్రీకృష్ణుని, శ్రీరాముని జయంతులు, జరుపుకుంటున్న విధంగా, పరశు రామ జయంతిని కూడా జరపాలని శాస్త్ర వచనం. పరశు రాముడు చిన్నతనంలో తన తండ్రి పితామహుడైన భృగు మహర్షి ఆశ్రమానికి వెళ్లగా, ఆ బాలకుని తేజస్సుకు తాళలేక, భృగు మహర్షి కళ్ళు మూసుకొని, ఆ బాలకుని హిమాలయాలకు వెళ్లి తపమాచరించిన మని సూచించాడు. బాలకుని తపస్సుకు, శివుడు ప్రత్యక్షమై, "నీవు ఇంకా చిన్నవాడివి, రౌద్రాస్త్రాలు, భరించే శక్తి నీకు లేదని కొంతకాలం తీర్థయాత్రలు చేయాలని", హితవు పలికాడు. తీర్థయాత్రలు పూర్తిచేసుకుని, తిరిగి తపస్సు ప్రారంభించగా, ఆ సమయంలో రాక్షస బాధలు తాళలేక, ఇంద్రాది దేవతలు శివుని శరణు వేడగా, భార్గవ రామునికి, పరమ శివుడు, "పరశువు" అనే గండ్రగొడ్డలి ఇచ్చి రాక్షసుల పైకి పంపడం చేత పరుశురామ నామాంకితు డైనాడు. అలా స్వర్గంలో రాక్షసులను లేకుండా చేశాడు. ఓ సందర్భంలో పరశు రాముడు, శివుని దర్శించబోగా ద్వారం వద్ద వినాయకుడు అడ్డగించాడు. కోపంతో పరశు రాముడు తన పరశువును విసిరేశాడు. తన తండ్రి శివుని ప్రసాదమైన పరశువుపై గౌరవంతో వినాయకుడు ఆ పరశువుతో తన దంతం విరిగేలా సమర్పించు కొన్నాడు. ఒకనాడు తల్లి రేణుక, నీళ్ళు తేవడానికి ఏటికి వెళ్లి అక్కడ చిత్రరథుడనే, గంధర్వ రాజు కుమారుడు, తన భార్యతో జలవిహారం చేయడాన్ని చూసి, తనకు అలాంటి అదృష్టం లేదని చింతిస్తూ, ఆశ్రమానికి ఆలస్యంగా వెళ్ళింది. ఆమె ఆలస్యానికి కారణం తెలుసుకున్న జమదగ్ని, కళంకితయైన, తల్లిని ఖండించాలి అని కుమారులను కోరాడు. ముగ్గురు మొదటివారు ఒప్పుకోని స్థితిలో, నాలుగవ వాడైన పరశురాముడు తండ్రి ఆజ్ఞను శిరసా వహించి, ఆమెను ఖండించాడు. అప్పుడు తండ్రి, పరశురాముని ఏదైనా వరం కోరుకోమనగా, తనకు మాతృ భిక్ష పెట్టమని ప్రార్థించాడు. అలా రేణుక పునరుజ్జీవితురాలు అయింది. తండ్రి ఆశ్రమంలో లేని సమయాన కార్తవీర్యార్జునుడు అనే రాజు కామధేనువు "సురభి" ని బలవంతంగా తీసుకు పోగా, పరశురాముడు, ఆ రాజును హతమార్చి, తిరిగి తెచ్చాడు. అందుకు పగబట్టిన కార్తవీర్యార్జునుని కుమారులు, జమదగ్నిని హత మార్చగా, తిరిగివచ్చిన పరశు రాముడు, విషయం తెలుసుకుని, వారి మీదికి దండెత్తి, గర్భస్థ పిండాలను కూడా వదలక చంపాడు. వారి నెత్తుటితో పితృ తర్పణం గావించాడు. పరశు రాముడు యావత్ క్షత్రియ జాతిపై ఆగ్రహించి వారిపై 21 మార్లు దండెత్తి క్షత్రియ వంశాలను నాశనం చేశాడు. శ్యమంతక పంచకమనే 5 సరస్సులను క్షత్రియుల రక్తంతో నింపి పరశు రాముడు తల్లి దండ్రులకు తర్పణం అర్పించాడు.

ఇలా అందరినీ హతమార్చడం చేత భూమి అంతా పరశు రాముని వశం అయింది. యజ్ఞం చేసి భూమి అంతయు బ్రాహ్మణులకు దానం చేశాడు. అశ్వమేధయాగం చేసి ఆ భూమిని కశ్యపుడికి దానంగా ఇచ్చాడు. అప్పటి నుండి భూమికి 'కశ్యపి' అనే పేరు వచ్చింది. దానం ఇచ్చిన నేలపై ఉండ కూడదని, బ్రాహ్మణులు అనగా... పరశు రాముడు సముద్రం వద్దకు వెళ్లి, తన సృవమును, సముద్రం లోనికి విసిరి వేయగా, రెండు యోజనాల దూరంలో పడగా, సముద్రుడు ఆ ప్రదేశం నుండి ఉపసంహరించు కున్నాడు. దానినే కొత్తగా ఏర్పడిన "మలబారు" ప్రాంతంగా చెబుతారు. అక్కడే పరశు రాముడు నివసించగా, ఆయన ఉన్న చోట కరువు ఉండదని, వజ్రోత్సవ చంద్రికలో పేర్కొన బడింది. "అబ్రహ్మణ్యే తథా దేశే కైవర్తాన్ ప్రేక్ష భార్గవ: స్థావయిత్వా స్వకీయే సక్షేత్రే విప్రాన్ ప్రకల్పితాన్"..స్కంధ పురాణం ఆధారంగా, కశ్యప బ్రాహ్మణునిచే వెడల కొట్టబడిన వాడైన పరశు రాముడు, సహ్యాద్రి పర్వత ప్రాంతమందు నివసించి, అక్కడి ఆటవికమైన కొండ జాతి వారికి జంధ్యములు వేసి బ్రాహ్మణులుగా మార్చినట్లు వివరించ బడింది. పరశు రాముడు 'కైవర్తా' ఆటవికులను బ్రాహ్మణులుగా గుర్తించడం వల్లనే కాబోలు - కొన్ని జాతుల వారికి 'రేణుకాదేవి' యిలవేల్పయినది

# పన్నులవాతే సంపద సృష్టా?

తెలుగు రాష్ట్రాలలోనే కాదు దేశం మొత్తం మీద సంపద సృష్టి చేయగలిగిన ఆర్థిక బ్రహ్మగా, బ్రహ్మాండమైన నాయకుణ్ణి నేనేనంటూ చెప్పుకుంటున్న నాయకులు, వారికి వంతపాడే ఆర్థిక మేధావులు, వారికి బాకాలూదే మీడియా సంస్థల వారు కోకొల్లలుగా ఉన్నారు మనకు. దశాబ్దాలుగా ఎన్నికల ముందు సభల్లో సహస్ర నామార్చనలా వినపడే ఈ సంపద మంత్రం అధికారంలోకి రాగానే వారికి వినపడని నిశ్శబ్ద తంత్రమై సుదీర్ఘకాలం తాము అధికారంలో ఉన్నా కూడా పేదల బతుకుల్లోకి ఈ సంపద జొరబడదు.పరిధి దాటిన అప్పుల కుప్పలతో జీతాలు కూడా ఇవ్వలేని స్థితి లో ఖజానా ఖాళీగా దర్శనమిస్తూ ఉంటుంది. ఇక కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న జిఎస్‌టి, ఏకపన్ను వివిధ రాష్ట్రాల్లో విభిన్న విశ్వరూపమై ఏది కొన్నా, ఏది తిన్నా జేబులు ఖాళీ చేస్తోంది. ఇది కేవలం ప్రభుత్వాలకు మాత్రమే సంపద సృష్టి. కేంద్రం వివిధ పథకాలకు రాష్ట్రాల వాటా క్రింద ఇస్తున్న నిధులు పక్కదారి పట్టి ఏ ఖాతాలోనో సంపదగా పోగై ఉండవచ్చు.దేశంలోను, రాష్ట్రాల్లోను సామాజిక బాధ్యతగా మానవ వనరులు సద్వినియోగమై ఆర్థికంగా ప్రజలంతా దిగువ మధ్య తరగతి గీతదాటి వస్తే సంపద సృష్టి జరిగినట్లే.

జాతీయ ఆదాయం పెరిగినట్టే. ప్రభుత్వాల మనుగడ కోసం, స్వార్థపూరితమైన ఆలోచనలతో ఇసుక మొదలు, కరెంటు, వాటర్, ఆస్తి పన్నులు, నిత్యావసర వస్తువుల రేట్లు చుక్కలనంటించి, అన్ని శాఖల్లో పన్ను లు విపరీతంగా పెంచి, మద్యం ఏరులై పారించి, అదే సృష్టించిన సంపదని భ్రమింపజేస్తే ఆ భారాన్ని భరించలేక ప్రజలు ఇక్కట్లపాలవుతున్నారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలైతే వృత్తి పన్నులు, చెత్త పన్నులు అంటూ కొత్త పన్నుల బాటపట్టాయి. దేశవ్యాప్తంగా రోడ్ల నిర్మాణం జరిగి దశాబ్దాలు దాటుతున్నా కనీసం రిపేర్లకు నోచుకోకపోయినా టోల్ ట్యాక్స్‌తో తోలు తీసేస్తారు. ఇది చాలదన్నట్లు ఆస్తి వారసత్వపు సంపదపై కూడా పన్నులు విధించాలనే మెరుపు లాంటి ఆలోచనను కూడా సంపద సృష్టిలో భాగస్వామ్యం చేద్దామనుకుం టున్నారు. భూమి, అడవులు, సముద్ర, నదీ జలాలు, రవాణా, ఖనిజ సంపదలు దోపిడీకి గురవ్వకుండా సద్వినియోగం చేయగలిగితే సంపద సృష్టి జరుగుతుంది. ప్రపంచ బ్యాంకుల నుండి అప్పులు తేవడం, పేదల భూములన్నీ తక్కువ రేటుకు లాక్కుని ప్రభుత్వ బిల్డింగులు కట్టడం, అదే సంపద సృష్టి అనుకుంటే దానికి అనుభవం అక్కరలేదు. ఏదో రకంగా మళ్ళీ మేమే గెలుస్తామని ధైర్యముంటే చాలు. నేనేసిన రోడ్లపై నడుస్తూ, నేనిచ్చిన కరెంటు వాడుకుంటూ, మా పాలనలో మాత్రమే కాపాడబడుతున్నఈ భారత దేశంలో నివసిస్తూ, మనుషులనే కాదు దేవుళ్ళను కూడా కాపాడుతున్న నాకెందుకు ఓటెయ్యరనే ఓటరునే ప్రశ్నించే తెగువతనం పాలకుల్లో కనబడుతున్నది. నాణ్యమైన ఉచిత విద్యనందించడంతో పాటు విదేశీ విద్యకు తోడ్పాటునందిస్తే విదేశాల్లో ఉద్యోగాలు చేసి మన దేశానికి సంపదను పంపుతారు. నాణ్యమైన ఉచిత వైద్యం ప్రభుత్వమే అందించి, ప్రజలకు ఖర్చు తగ్గిస్తే ఆరోగ్యమైన సమాజంతో పాటు ప్రజలకు ఆర్థిక పరిపుష్టి కలుగుతుంది. సన్న, చిన్నకారు రైతులకు నాణ్యమైన సబ్సిడీ విత్తనాలు, సరికొత్త సేద్యపు విధానాలు, నిరంతర నీటి సరఫరా, పంటలకు గిట్టుబాటు ధరలపై ప్రభుత్వం శ్రద్ధపెడితే రైతే రాజై సంపదని సృష్టిస్తాడు. అంతేకాని ఆత్మహత్యల సౌధాలపై అర్థిక జిడిపి లెక్కలు వేయకూడదు.

ప్రభుత్వ ఖజానాలను కొల్లగొట్టి దివాలా తీయిస్తున్న ఉచిత పథకాల పునాదుల పిల్లర్లపై పార్టీలను, ప్రభుత్వాలను నిలబెట్టరాదు. అత్యధిక జనాభా కలిగిన దేశంగా ముందు వరసలో ఉన్న మనం ఐక్యరాజ్య సమితి 2019 లెక్కల ప్రకారం సుస్థిరాభివృద్ధి సాధన సూచికలో అమెరికా, డెన్మార్క్ లాంటివి 40 వ స్థానం లోపలుంటే మనం 115 వ స్థానంలో ఉన్నాం. ఇది మన పాలకుల సుదీర్ఘ కార్యనిర్వాహక సామర్థ్యం. ప్రణాళికాబద్ధంగా మానవ వనరుల అభివృద్ధి చేసి వచ్చిన ఆదాయంలో నుంచి పేద వాళ్ళకు ప్రభుత్వాలు పన్ను రహిత ఉచిత సేవలు అందిస్తూ స్వయం ప్రకాశంగా ఎదిగేందుకు, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు ప్రయత్నిస్తే అదే సంపద సృష్టి. ప్రభుత్వ శాఖల్లో వారి జీతభత్యాలు, ఇతరత్రా ఉచిత సౌకర్యాలతో పాటు, పావలా పని చేసి పది రూపాయల ప్రచారం కోసం చేసే ప్రభుత్వ ఖర్చు, ఇవన్నీ తగ్గించే పొదుపు ద్వారా సంపద సృష్టి జరుగుతుంది. సౌర విద్యుత్తు ఉత్పత్తి ద్వారా విద్యుదుత్పాదక ఖర్చుతో పాటు నీటి వినియోగం తగ్గించవచ్చు. అపారమైన నీటి వృథా అరికట్టడం, అటవీ వృక్షసంపదను కాపాడడం ద్వారా ఔషధ రూపంలో మందుల ఉత్పత్తి ఖర్చు తగ్గించవచ్చు. ఏదైన మామూలు మనిషి జీవనం మెరుగుపడే విధంగా చేస్తే అదే సంపద సృష్టి. పాలనలో విధానపరమైన నిర్ణయాలు తీసుకోకుండా చేయాలంటే సంపద సృష్టించడానికి ఏ నాయకుని వద్దనైనా ఏవైనా తంత్ర విద్యలు, మంత్ర దండాలు ఉన్నాయేమో తెలియదు మరి!

http://vaasthavanestham.com
# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



# భీంపూర్'లో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్






వాస్తవ నేస్తం,భీంపూర్: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ ప్రక్రియ మండలంలో ప్రశాంతంగా ముగిసింది. సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు సాగింది.ఓటర్లు ఉదయాన్నే పోలింగ్ కేంద్రాల వద్దకు బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గోన గ్రామం నుంచి ధనోర పోలింగ్ స్టేషన్ 1 కిలో మీటర్ దూరం ఉండడంతో మహిళలు, వృద్దులు నడుచుకుంటూ వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దూర భారం ఎక్కువగా ఉండడంతో కొంత ఆసౌకర్యానికి గురయ్యారు. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగిసే సరికి మండలంలోని 36 పోలింగ్ స్టేషన్ పరిధిలో 79% శాతం పోలింగ్ నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. కాగ యువ ఓటర్లు మొదటి సారి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



## ఓటు హక్కును వినియోగించుకున్న బీజేపీ పార్టీ ఎంపీ అభ్యర్థి

**వాస్తవ నేస్తం,జుక్కల్ (మద్నూర్):** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం డోంగ్లి మండల కేంద్రంలోని సిర్పూర్ గ్రామంలో జహీరాబాద్ పార్లమెంట్ భారతీయ జనతా పార్టీ అభ్యర్థి బీబీ పాటిల్ తన కుటుంబ సభ్యులతో కలిసి అందరితోపాటు వరుస సంఖ్యలో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజలందరూ తమ అమూల్యమైన ఓటుతో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని తెలిపారు.



## జుక్కల్ నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

**వాస్తవ నేస్తం,జుక్కల్:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం రోజు జరిగిన పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జుక్కల్ నియోజకవర్గం లో పోలైన ఓటింగ్ శాతం 75.83 శాతం కాగా, నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 202887 ఉండగా, ఇందులో మహిళా ఓటర్లు 76705 ఓటు హక్కును వినియోగించుకోగా, 77146 మంది పురుషులు ఓటును, ఒక్కరు ట్రాన్స్ జెండర్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా జుక్కల్ నియోజకవర్గం లో 1,53,852 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న ట్రాన్స్ జెండర్

**వాస్తవ నేస్తం:** నిర్మల్ జిల్లా లో ట్రాన్స్ జెండర్ లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ట్రాన్స్ జెండర్ స్వర్ణ ప్రియ తమ స్వగ్రామం అయిన సారంగా పూర్ మండలం లోని స్వర్ణ లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజా స్వామ్య దేశం లో ఓటు ఏంతో విలువైంద ని,ప్రతి ఒక్కరూ ఓటింగ్ లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.





## ఎన్నికల సిబ్బందికి పాము కాటు

**వాస్తవ నేస్తం,భీంపూర్:** మండలంలోని అందర్ బంద్ పోలింగ్ కేంద్రంలో ఎన్నికల సిబ్బంది ప్రఫుల్ రెడ్డికి ఆదివారం సాయంత్రం పాము కాటేసింది. టాయిలెట్ కు వెళ్ళినప్పుడు పాము కాటేయడంతో వెంటనే భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అంబులెన్స్'లో ఆదిలాబాద్ లోని రిమ్స్ కి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. జైనథ్ మండలం ముక్తాపూర్లో ఉపాధ్యాయుడిగా ప్రాఫుల్ రెడ్డి విధులు నిర్వహిస్తున్నారు.

## మేము ఓటు వేసాము మీరు కూడా వేయండి.. ఓటు వేసినా ట్రాన్స్ జెండర్లు

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** పట్టణ కేంద్రంతోపాటు ఉట్నూర్, పిట్టల వాడ, రాంనగర్, కే.ఆర్.కే కాలనీలో ట్రాన్స్ జెండర్లు స్వచ్ఛందంగా పోలింగ్ బూత్ ల వద్దకు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరు ఓటు వేసి అభివృద్ధికి నాంది పలుకాలన్నారు. అనంతరం పోలింగ్ కేంద్రాల వద్ద సిరా చుక్క వేలును చూపిస్తూ సెల్ఫీలు దిగారు. ఓటు హక్కును వినియోగించుకోవడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు.



# ముగిసిన పోలింగ్.. తెలంగాణలో పెరిగిన ఓటింగ్ శాతం



ఓటు హక్కు వినియోగించుకున్న ఆదిలాబాద్ స్వతంత్ర ఎంపీ అభ్యర్థి రాథోడ్ సుభాష్



ఇచ్చోడ మండలంలోని ఆడేగామ(కే) గ్రామంలో ఓటు హక్కును వినియోగించుకున్న గ్రామస్తులు

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. ఎక్కడ ఎలాంటి సమస్యలు లేకుండా రాష్ట్రవ్యాప్తంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. లా అండ్ ఆర్డర్ విషయంలో పోలీసుల సహకారం పూర్తిగా అందిందని ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్ తెలిపారు. 2019తో పోల్చితే ఐదు నుంచి 10 శాతం పోలింగ్ పెరిగే అవకాశం ఉంటుంది అన్నట్లుగా అంచనా వేస్తున్నారు ఎన్నికల అధికారులు. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు ఎక్కడ ఎలాంటి సమస్యలు లేకుండా జరిగింది. అయితే మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన 5 పార్లమెంట్ స్థానాల్లోని 13 అసెంబ్లీ నియోజకవర్గాలైన అదిలాబాద్ పార్లమెంట్ లోని సిర్పూర్, ఆసిఫాబాద్, పెద్దపల్లిలో చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల, మంథని, వరంగల్ పార్లమెంట్ పరిధిలో భూపాలపల్లి, మహబూబ్ బాద్ పార్లమెంట్ పరిధిలో ములుగు, పినపాక, ఇల్లందు, భద్రాచలం, ఖమ్మం పార్లమెంట్ పరిధిలో కొత్తగూడెం, అశ్వారావుపేట లో సాయంత్రం నాలుగు గంటలకి ముగిసింది. ఆదిలాబాద్ జిల్లాలోని బాబ్జిపేట్, దేగాం గ్రామస్తులు తమ గ్రామంలో అభివృద్ధి పనులు జరగలేదని, తమ సమస్యలు పరిష్కారం అవ్వలేదని ఓటు వేయమని భీష్మంచి కూర్చున్నారు. కాగా ఇట్టి విషయాన్ని తెలుసుకున్న అధికారులు గ్రామస్తులకు నచ్చజెప్పి ఉన్నతాధికారులతో మాట్లాడిన సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఓటింగ్ ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభమైంది. వివిధ పార్టీల నుండి పోటీ చేసిన ఎంపీ అభ్యర్థులు, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, రాజకీయ నాయకులు, యువతి యువకులు, తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

– వాస్తవ నేస్తం,నెట్ వర్క్



ఓటు హక్కును వినియోగించుకొని సిరా చుక్కను చూపిస్తున్న బీజేపీ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి నగేష్



ఇచ్చోడ ఓటు హక్కును వినియోగించుకున్న ఓటర్లు



తన ఓటు హక్కును వినియోగించుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ యాదవ్ దంపతులు




మొదట సారి తన ఓటు హక్కు వినియోగించుకున్న విద్యార్థినివిద్యార్థిని మేడపట్ల ధరణి

ఓటు హక్కు వినియోగించుకున్న డీఎస్పీ పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి అన్నెల లక్ష్మణ్





ఇచ్చోడ మండలంలోని సిరిచల్మలో ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం సిరాజ్ కను చూపిస్తున్న మాజీ ఉప సర్పంచ్



ఇచ్చోడ మండలంలోని మాధపూర్ లో ఓటు హక్కును వినియోగించుకున న్ యువకులు



కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

# మద్యం తాగే మహిళలకు షాకింగ్ న్యూస్



మద్యం సేవించడం వల్ల మీ ఆరోగ్యానికి హాని కలుగుతుంది. సెంటర్ ఫర్ డిసీజ్ అండ్ ప్రివెన్షన్ ప్రకారం.. ఒక పురుషుడు ఒకేసారి 5 డ్రింక్స్, ఒక మహిళ ఒకేసారి 4 డ్రింక్స్ తీసుకుంటే ఆమె అతిగా తాగేవారిగా గుర్తించవచ్చు. ఇటీవల, ఆల్కహాలిక్ డ్రింక్స్‌పై ఒక అధ్యయనం జరిగింది. ఇది తక్కువ ఆల్కహాల్ తాగే మహిళల కంటే వారానికి ఎనిమిది కంటే ఎక్కువ ఆల్కహాలిక్ డ్రింక్స్ తాగే మహిళలకు గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని పేర్కొంది. 'అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ' పరిశోధన లక్ష్యం మద్యపానం, కరోనరీ హార్ట్ డిసీజ్ మధ్య సంబంధాన్ని కనుగొనడం. అందుకే ఈ అధ్యయనం నిర్వహిస్తోంది. ఉత్తర కాలిఫోర్నియాలోని క్యాన్సర్ పర్మనెంట్ హెల్త్‌కేర్ ఆర్గనైజేషన్‌లో పరిశోధకులు 18 నుండి 65 సంవత్సరాల వయస్సు గల 4.32 లక్షల మంది వ్యక్తుల నుండి డేటాను ఉపయోగించారు. అలాగే విశ్లేషించారు. అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ ప్రకారం.. వారిలో 2.43 లక్షల మంది పురుషులు, 1.89 లక్షల మంది మహిళలు, వారి సగటు వయస్సు 44 సంవత్సరాలు. పరిశోధనలో వాటిని 2014-2015లో పరిశీలించారు. వారు తక్కువ, మితమైన లేదా ఎక్కువ పరిమాణంలో తాగేవారు. దీని తరువాత వారి డేటా 4 సంవత్సరాల తర్వాత మళ్లీ సేకరించారు. కాలిఫోర్నియాకు చెందిన హార్ట్ స్పెషలిస్ట్, అధ్యయన అధిపతి డాక్టర్ జమాల్ రానా ఫాక్స్ న్యూస్ డిజిటల్‌తో మాట్లాడుతూ, 'ఈ రోజుల్లో మద్యం సేవించడం గుండెకు మంచిదని పుకారు వ్యాపిస్తుంది. అయితే ఈ నమ్మకానికి వ్యతిరేకంగా పరిశోధనలు రుజువు చేశాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచడానికి ఆల్కహాల్ కారణమని, మరింత అవగాహన కలిగి ఉండాలని భావిస్తున్నారు.

పురుషులు, మహిళలు ఇద్దరికీ వారానికి 1-2 పానీయాలు తక్కువగా ఆల్కహాల్ తీసుకునే స్థాయిని పరిశోధన కనుగొంది. అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ ప్రకారం.. పురుషులకు వారానికి 3-14 పానీయాలు, మహిళలు వారానికి 3-7 పానీయాలు మితమైన మద్యపానంగా పరిగణిస్తారు. పురుషులకు వారానికి 15 లేదా అంతకంటే ఎక్కువ పానీయాలు, మహిళలకు, 8 లేదా అంతకంటే ఎక్కువ పానీయాలు అతిగా మద్యపానం చేసే వర్గం జాబితాలో ఉంచారు. నాలుగు సంవత్సరాల తర్వాత పరిశీలించినప్పుడు అధ్యయనంలో 3108 మంది కరోనరీ హార్ట్ డిసీజ్‌కు చికిత్స పొందారని పరిశోధకులు కనుగొన్నారు. ఇది అధిక ఆల్కహాల్ తీసుకోవడం వల్ల తీవ్రమైంది. వారానికి 8 లేదా అంతకంటే ఎక్కువ పానీయాలు తాగే స్త్రీలు తక్కువ ఆల్కహాల్ తాగే మహిళల కంటే 33 నుండి 51 శాతం ఎక్కువ గుండె జబ్బుల ముప్పును కలిగి ఉన్నారు. అతిగా మద్యం సేవించే మహిళలపై ఒక అధ్యయనం నిర్వహించగా, మితంగా మద్యం సేవించే మహిళల్లో కంటే ఎక్కువగా తాగే మహిళల్లో గుండె జబ్బుల ముప్పు మూడింట రెండొంతులు ఎక్కువగా ఉన్నట్లు తేలింది.

# జుట్టు రాలకుండా ఉండాలంటే!

ప్రస్తుత కాలంలో చాలా మంది ఇబ్బంది పడే సమస్యల్లో జుట్టు రాలడం కూడా ఒకటి. మగవారైనా, ఆడవారికైనా ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. అలాగే వయసుతో సంబంధం లేకుండా ఈ సమస్య పెరుగుతుంది. జుట్టు అంతా రాలిపోయి.. జుట్టు పల్చగా, సన్నగా మారి ఇబ్బందిగా ఉంటుంది. జుట్టు రాలడం అనేది సర్వ సాధారణమైనది. అయితే ఈ జుట్టు మరింత ఎక్కువగా రాలితేనే సమస్య. తక్కువ కాలంలో ఎక్కువగా జుట్టు రాలిపోతూ ఉంటే.. సరైన కేర్ తీసుకోవాలని అర్థం. అంతే కాకుండా ఆహార పరంగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. జుట్టుకు సరైన పోషణ అందించాలి. ఇలా చేస్తూ ఉంటే.. జుట్టు రాలడం తగ్గి.. జుట్టు అందంగా, ఒత్తుగా పెరుగుతుంది.



**హెల్దీ ఫుడ్:** జుట్టు రాలడానికి ప్రధాన సమస్య సరైన పోషణ అందకపోవడం. జుట్టుకు సరైన పోషణ అందితే.. రాలడం, చిట్లడం వంటి సమస్యలన్నీ తగ్గుతాయి. జుట్టు ఒత్తుగా, పొడుగ్గా ఉండాలంటే.. ఐరన్, జింక్, విటమిన్లు ఏ, డి అవసరం. ఈ పోషకాల లోపం లేకుండా చూసుకుంటే జుట్టు బలంగా ఎదుగుతుంది. అలాగే మీ డైట్‌లో పండ్లు, కూరగాయలు, నట్స్ కూడా ఉండేలా చూసుకోండి. అన్ని పోషకాలతో నిండిన సమతుల్య ఆహారాన్ని తింటే జుట్టు రాలడం దానంతట అదే తగ్గుతుంది.


**స్కాల్ప్ కేర్:** మీరు వాడే ఆయిల్‌తోనే స్కాల్ప్ కేర్ కూడా తీసుకోవాలి. అప్పుడప్పుడూ తలకు మసాజ్ చేస్తూ ఉండాలి. ఇలా చేయడం వల్ల తలపై రక్త ప్రసరణ జరుగుతుంది. దీని వల్ల వెంట్రుకలకు పోషణ అందుతుంది. ఆరోగ్యకరమైన జుట్టు పెరగడానికి దోహద పడుతుంది. కొబ్బరి నూనె, బాదం నూనె చక్కగా పని చేస్తుంది. ఇవి వద్దు: మీరు జుట్టుకు వాడే షాంపూలు, కండీషనర్ల కారణంగా కూడా జుట్టుకు రాలిపోవడం జరుగుతుంది. ఇందుకు కారణం ఏంటంటే.. షాంపూలు, కండీషనర్లలో రసాయనాలు కలపడమే. కాబట్టి మీరు తినే ప్రొడెక్ట్స్‌లో సల్ఫేట్ లేనివి తీసుకోవాలి. అదే విధంగా స్టైయిట్‌నర్లు, కర్లింగ్ ఐరన్ వంటి ఎలక్ట్రికల్ ప్రోడెక్ట్స్ కారణంగా కూడా జుట్టు రాలుతుంది. కాబట్టి వీటి వాడకాన్ని బాగా తగ్గించాలి. ఒత్తిడి:ఒత్తిడి, ఆందోళన కారణంగా కూడా జుట్టు అనేది ఎక్కువగా రాలుతుంది. కాబట్టి వీలైనంత వరకూ ఒత్తిడి, ఆందోళనకు దూరంగా ఉండటం మంచిది. ఉదయం పూట వాకింగ్ చేయడం వల్ల ఒత్తిడి, ఆందోళన అనేవి తగ్గుతాయి. ఈ జాగ్రత్తలు తప్పనిసరి: ముందు నుంచే కొన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవడం వల్ల జుట్టు రాలే సమస్యను తగ్గించుకోవచ్చు. వారానికి రెండు సార్లు షాంపూతో తలస్నానం చేయాలి. అదే విధంగా నీటిని ఎక్కువగా తీసుకుంటూ ఉండాలి. దీని వల్ల జుట్టు పొడిబారకుండా హైడ్రేట్‌గా ఉంటుంది. తలకు ఆయిల్ రాస్తూ ఉండాలి. అప్పుడప్పుడూ తలపై మర్దనా చేస్తూ ఉండాలి.

# కొబ్బరి బోండా నుండి నేరుగా కొబ్బరినీళ్లు తాగకూడదట



తాజా కొబ్బ రి నీళ్లు తాగితే శరీరానికి ఉపశమనంగా ఉంటుంది. కొబ్బరినీరు మంచిదే కానీ, కొబ్బరి బోండం నుండి నేరుగా తాగకూడదని వైద్యుల అభిప్రాయం.ఆ కొబ్బరి బోండంలో నీళ్లను ఒక గాజు గ్లాసులో పోసి అప్పుడు వాటిలో ఎలాంటి మలినాలు లేవని నిర్ధారించుకున్నాకే తాగాలని చెబుతున్నారు. ఎందుకంటే కొన్నిసార్లు కొబ్బరిబోండం లోపల మైకోటాక్సిన్ల ఉత్పత్తి జరుగుతుంది. దీనివల్ల ఆ నీళ్లు తాగితే తీవ్రమైన అలెర్జీలు, శ్వాసకోశ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కొబ్బరినీళ్లు ఆరోగ్యానికి అంతా మేలే చేస్తాయి. తీవ్రమైన ఉష్ణోగ్రతల నుండి ఉపశమనం కలిగిస్తాయి. మీ జీర్ణక్రియకు, మూత్ర విసర్జనకు సహకరిస్తాయి. తక్షణ శక్తిని అందిస్తాయి. కొబ్బరి నీళ్లలో పొటాషియం, మాంగనీస్, క్యాల్షియం, యాంటీ ఆక్సిడెంట్లు, సైటోకైనెన్స్ వంటి ఖనిజాలు అధికంగా ఉంటాయి. అలాగే శరీరానికి తక్షణ శక్తిని అందించే ఎలక్ట్రోలైట్లు కూడా ఉంటాయి. కానీ కొబ్బరి బోండాం లోపలి భాగంలో కొన్నిసార్లు ఒక రకమైన ఫంగస్ పెరిగే అవకాశం ఉంది. ఇది నీటి రుచిని కూడా మారుస్తుంది. అలాగే కొన్ని రకాల తీవ్రమైన శ్వాసకోశ సమస్యలకు కారణం అవుతుంది. కాబట్టి కొబ్బరిబోండం లోపల అంతా శుచిగా ఉందో లేదో చూడకుండా ఆ నీటిని తాగేయకూడదు. కొబ్బరి బొండంలో అధికంగా మోల్డ్ అని పిలిచే సూక్ష్మజీవులు చేరుతూ ఉంటాయి. ఇది ఒక చిన్న జీవి. దీనిని ఫంగస్ అని కూడా పిలుచుకోవచ్చు. తడిగా ఉండే ప్రాంతాల్లో ఇవి అభివృద్ధి చెందుతాయి. తగినంత నీటి సౌకర్యం ఉన్నప్పుడు ఈ మౌల్డ్ వ్యాప్తి చెందుతూ ఉంటుంది. కొబ్బరి బోండానికి అడుగున ఈ మోల్డ్ జీవించే అవకాశం ఉంది. కాబట్టి ఆ నీటిని ఒక గాజు గ్లాసులో వేసుకొని ఎలాంటి నల్లని పదార్థాలు లేవని నిర్ధారించుకున్నాకే తాగాలి. ఈ మోల్డ్ ఉన్న ఆహారాలు తినడం వల్ల తీవ్రమైన అలెర్జీ వస్తుంది. తుమ్ములు, ముక్కు నుండి నీరు కారడం, కళ్ళు ఎరుపుగా మారడం, కళ్ల నుండి నీరు కారడం, చర్మంపై దద్దుర్లు రావడం, ముక్కులో దురద రావడం, దగ్గు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఒక్కోసారి వీటిలో హానికరమైన టాక్సిన్లు కూడా ఉంటాయి. ఇవి పొట్ట, కాలేయం, మూత్రపిండాలపై ప్రభావాన్ని చూపిస్తాయి. హార్మోన్ల అసమతుల్యతకు దారితీస్తాయి. అలాగే క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని కూడా పెంచుతాయి. ఈ కొబ్బరి బోండాల్లోనే కాదు, తడిగా ఉండే ఇతర ఏ ఆహార పదార్థాల పైన అయినా ఈ ఫంగస్ పెరగవచ్చు. కాబట్టి ఆహారాన్ని చాలా జాగ్రత్తగా భద్రపరచుకోవాలి. త్వరగా పాడవుతాయనుకునే పదార్థాలను ఫ్రిజ్లో ఉంచుకోవడం మంచిది.

# విహారానికి విశాఖపట్నం వెళ్తే ఈ ప్రకృతి ప్రాంతాలను చూడండి




విశాఖపట్నం అంటే అందరికీ గుర్తొచ్చేది బీచ్ మాత్రమే. నిజానికి బీచ్‌ని మించిన అందాలు అక్కడ ఎన్నో ఉన్నాయి. పర్యాటకపరంగా విశాఖ ప్రకృతి అందాలతో అలరారుతుంది. ఒక రెండు రోజులు విశాఖలో ఉంటే ఎన్నో అద్భుతమైన ప్రకృతి సిద్ధమైన పర్యాటక ప్రాంతాలను చూడవచ్చు. కుటుంబ సమేతంగా గడిపేందుకు విశాఖపట్నం ఒక అందమైన డెస్టినేషన్ అని చెప్పుకోవచ్చు. వైజాగ్ బీచ్ లో సాధారణంగా అందరూ చూస్తారు. కానీ ఖచ్చితంగా చూడాల్సిన ప్రాంతాలు కొన్ని ఉన్నాయి.

దుడుమ జలపాతాలు: జలపాతాల కోసం కేరళ వెళ్లాల్సిన అవసరం లేదు. విశాఖలోని అందమైన జలపాతం ఉంది. అదే దుడుమ జలపాతం. ఆంధ్రా, ఒడిశా మధ్య సరిహద్దుల్లో ఈ దుడుమా జలపాతాలు ఉంటాయి. వైజాగ్ నుండి 177 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తుంది. వైజాగ్లో బస్సు ఎక్కితే 5 గంటల ప్రయాణం తర్వాత ఈ జలపాతాలను చేరుకోవచ్చు. ఈ ప్రయాణం అంతా పచ్చని అందాల మధ్య సాగుతుంది. కాబట్టి పెద్ద అలసటగా అనిపించదు. సాయంత్రం పూట ఈ జలపాతాలను చూస్తే కళ్ళు తిప్పుకోలేరు. గోస్తనీ గుహలు: దుడుమా జలపాతాన్ని చూసి ఆనందించాక... చూడాల్సిన మరొక చారిత్రక ప్రదేశం గోస్తనీ గుహలు. ఇది వైజాగ్ నుండి 90 కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. ఇక్కడ ట్రెక్కింగ్ కూడా చేయవచ్చు. బొర్రా గుహలలోని ఏడు గుహల సముదాయంలో ఈ గోస్తనీ గుహలు ఒకటి. ఇవి కాస్త చీకటిగా ఉండే గుహలు. దాదాపు నాలుగు కిలోమీటర్ల వరకు ట్రెక్కింగ్ చేయాలి. అక్కడ ఉండే స్థానికులు ట్రెక్కింగ్‌కు వెళ్లే వారిని గ్రూపులుగా విడదీసి గుహలను చూసేందుకు పంపిస్తారు. ట్రెక్కింగ్ ఇష్టపడేవారు ఈ గుహలను కచ్చితంగా చూడాల్సిందే.

కంబాల కొండ అడవి: కంబాలకొండ అడవి వైజాగ్ కు చాలా దగ్గరలో ఉంటుంది. ఈ అడవి ఏడు వేల ఎకరాల్లో విస్తరించి ఉంటుంది. ఇందులో ఎన్నో అరుదైన చెట్లతోపాటు జంతువులు ఉంటాయి. అందమైన ప్రకృతి దృశ్యాల మధ్య కొన్ని గంటల పాటు గడపాలనుకుంటే ఈ కంబాలకొండ అడవికి వెళ్ళండి. వైజాగ్ నుండి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. ఇక్కడ చిరుతపులులు, జింకలు, నక్కలు ఇంకా ఎన్నో పక్షులు కనిపిస్తాయి. జిందగడ శిఖరం: ఆంధ్రప్రదేశ్లో ఉన్న ఎత్తైన శిఖరాల్లో ఈ జిందగడ శిఖరం మొదటిది. వైజాగ్ నుంచి కేవలం 140 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. సముద్రమట్టానికి 1690 మీటర్ల ఎత్తులో కనిపిస్తుంది. ఇక్కడ నుంచి చూస్తే అరకులోయ అందాలను చూడవచ్చు. ఈ శిఖరానికి చేరుకోవాలంటే అందమైన ఏజెన్సీ గ్రామాలైన మాడుగల, పాడేరు, దుంబ్రిగూడ మధ్యగా అరకు రోడ్డులో ఈ శిఖరానికి చేరుకోవాలి. పది కిలోమీటర్ల పాటు ట్రెక్కింగ్ కూడా చేయాల్సి వస్తుంది. రాత్రి అక్కడ క్యాంపింగ్ చేసుకొని కూడా ఉండవచ్చు.

# నిద్రలేచిన వెంటనే అద్దంలోకి చూసుకుంటున్నారా..?



మనలో చాలా మందికి ఉదయం నిద్రలేచిన వెంటనే అద్దంలో చూసుకునే అలవాటు ఉంటుంది. కానీ వాస్తు శాస్త్రం ప్రకారం ఇది అశుభం అంటున్నారు జ్యోతిశాస్త్ర నిపుణులు.ఇది శరీరం, మనస్సుపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని చెబుతున్నారు. వాస్తు నియమాల ప్రకారం ఉదయాన్నే నిద్రలేచి ముఖాన్ని అద్దంలో చూసుకోకూడదు. దీనివల్ల జీవితంలో సమస్యలు పెరుగుతాయంటున్నారు. ఈ కారణంగా పడకగదిలో అద్దం ఉండకూడదనే నియమం ఉంది. ఉదయాన్నే అద్దం చూసుకోవడం వాస్తులో నిషిద్ధం. ఉదయం నిద్రలేవగానే అద్దంలో చూసుకోవడం మీ జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో ఇక్కడ తెలుసుకుందాం..రాత్రి నిద్రిస్తున్నప్పుడు, అద్దం చుట్టూ ప్రతికూల శక్తి ఉంటుందని నమ్ముతారు. అందువల్ల, మీరు ఉదయం నిద్రలేచిన వెంటనే అద్దంలో చూసుకోవడం వల్ల ఈ ప్రతికూల శక్తి వ్యక్తిని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. ఫలితంగా ఆ వ్యక్తి అనవసరమైన అలసట, ఒత్తిడిని అనుభవించాల్సి వస్తుంది. ఉదయం నిద్రలేచిన వెంటనే అద్దంలో చూసుకుంటే మనసుకు ఆటంకం కలుగుతుందని నమ్ముతారు. ఉదయం నిద్రలేచిన వెంటనే అద్దంలో చూసుకుంటే ముఖంపై మొటిమలు, ముడతలు, నెరిసిన జుట్టు, మచ్చలు కనిపిస్తాయి. ఇది ఆ వ్యక్తి ఆత్మ విశ్వాసాన్ని ప్రభావితం చేస్తుంది. వాస్తుశాస్త్రం ప్రకారం, ఉదయాన్నే వారి వారి ముఖాన్ని అద్దంలో చూసుకోవటం, తమ నీడను తామే చూడటం అశుభం. ఉదయం నీడను చూడటం వల్ల నెగిటివ్ ఎనర్జీ వ్యక్తి లోపలికి ప్రవేశిస్తుంది. నీడను చూసినప్పుడు వ్యక్తి మానసిక ఉద్రిక్తత పెరుగుతుంది. నెగిటివ్ శక్తి ఆధిపత్యం చెలాయిస్తుంది. ఉదయం పూట సొంత నీడను చూడటం వాస్తులో నిషేధం.

స్థానిక వార్తలు

## పుంజుకున్న స్టాక్ మార్కెట్లు..

## 111 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్



దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. గతవారం ముగింపులో భారీ నష్టాల్లో ముగిసిన సూచీలు సోమవారం పుంజుకున్నాయి. దేశంలో రాజకీయ పరిస్థితులు, క్రూడాయిల్ ధరల పెరుగుదల నేపథ్యంలో సూచీలు పతనమయ్యాయి. రాజకీయాలకు, స్టాక్ మార్కెట్లకు లింక్ చేయకూడదని కేంద్రమంత్రి అమిత్‌షా వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో సూచీలు లాభాల్లో ట్రేడాయి. స్టాక్స్ కదలికలను తాను ఊహించలేదని.. కానీ, సాధారణంగా కేంద్రంలో స్థిరమైన ప్రభుత్వం ఏర్పడినప్పుడల్లా మార్కెట్ ర్యాలీని చూస్తుందని.. తాము 400కుపైగా సీట్లను గెలుచుకుంటామన్నారు. మళ్లీ మోదీ ప్రభుత్వం వస్తుందని.. దాంతో మార్కెట్ పెరుగుతుందని ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కిత్రం సెషన్‌తో పోలిస్తే సోమవారం ఉదయం సెన్సెక్స్ 72,476.65 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. ఇంట్రాడేలో ఒక దశలో 71,866.01 పాయింట్లు పతనమైన సెన్సెక్స్.. గరిష్ఠంగా 72,863.56 పాయింట్లకు పెరిగింది. చివరకు 111.66 పాయింట్లు పెరిగి 72,776.13 వద్ద ముగిసింది. నిఫ్టీ 48.85 పాయింట్లు పెరిగి.. 22,104.05 వద్ద ముగిసింది. నిఫ్టీలో సిప్లా, ఏషియన్ పేయింట్స్, అదానీ పోర్ట్స్, దివిస్ ల్యాబ్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ లాభపడగా.. టాటా మోటార్స్, బీపీసీఎల్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎన్‌టీపీసీ, ఓఎన్‌జీసీ, కోల్ ఇండియా, భారతీ ఎయిర్‌టెల్ నష్టాల్లో ముగిశాయి. సెక్టోరల్ వారీగా నిఫ్టీ ఫార్మా 1.8శాతం పెరిగింది. నిఫ్టీ బ్యాంక్ 0.7శాతం, ఐటీ 0.4శాతం లాభపడింది. నిఫ్టీ ఆటో 1.68శాతం పడిపోయింది, పీఎస్‌యూ బ్యాంక్1.2 శాతం, , ఆయిల్ అండ్ గ్యాస్ 0.8శాతం పతనమయ్యాయి.

## భారత్ మార్కెట్లో న్యూ ఎంట్రీ లెవల్ నెక్సాన్ ఆవిష్కరణ..

# రూ.7.99 లక్షలతో షురూ..!




ప్రముఖ కార్ల తయారీ సంస్థ టాటా మోటార్స్ భారత్ మార్కెట్లోకి టాటా నెక్సాన్ న్యూ ఎంట్రీ లెవల్ వేరియంట్ కార్లను ఆవిష్కరించింది. పెట్రోల్ మోడల్‌లో స్మార్ట్ (ఓ), డీజిల్ మోడల్‌లో స్మార్ట్ ం, స్మార్ట్ ం ఎస్ కార్లు ఉంటాయి. కొత్తగా మార్కెట్లోకి ఎంటరైన నెక్సాన్ వేరియంట్లు.. మహీంద్రా అండ్ మహీంద్రా ఇటీవల మార్కెట్లోకి తెచ్చిన మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ కారుతో ఢీకొడతాయి. టాటా నెక్సాన్ స్మార్ట్ (ఓ) పెట్రోల్ వేరియంట్ ధర రూ.7.99 లక్షలు (ఎక్స్ షోరూమ్), డీజిల్ ఇంజిన్ ఆప్షన్‌తో వచ్చిన స్మార్ట్ ం వేరియంట్ రూ.9.99 లక్షలు (ఎక్స్ షోరూమ్), స్మార్ట్ ం ఎస్ వేరియంట్ రూ.10.59 లక్షలు (ఎక్స్ షోరూమ్) పలుకుతాయి. టాటా నెక్సాన్ న్యూ వేరియంట్లు అందుబాటు ధరలో ఉన్నాయి. పాత స్మార్ట్ మోడల్ కారుతో పోలిస్తే న్యూ స్మార్ట్ (ఓ) పెట్రోల్ వేరియంట్ రూ.15 వేలు, స్మార్ట్ ం వేరియంట్ రూ.30 వేలు, స్మార్ట్ ం ఎస్ వేరియంట్ రూ.40 వేలు తక్కువ ధరకు లభిస్తాయి. టాటా నెక్సాన్ టాప్ వేరియంట్ రూ.14.74 లక్షలు (ఎక్స్ షోరూమ్) పలుకుతుంది. భారత్ మార్కెట్లో కియా సొనెట్, మారుతి బ్రెజా, హ్యుండాయ్ వెన్యూ, మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ, నిస్సాన్ మ్యాగ్నైట్, రెనాల్ట్ కైగర్ మోడల్ కార్లతో పోటీ పడుతుంది. న్యూ ఎంట్రీ లెవల్ టాటా నెక్సాన్ కారులో ఎల్ఈడీ హెడ్ ల్యాంప్, ఎల్ఈడీ డీఆర్ఎల్స్, ఎల్ఈడీ టెయిల్ ల్యాంప్, 10.25 అంగుళాల టచ్ స్క్రీన్, 10.25 అంగుళాల డిజిటల్ డ్రైవర్ డిస్ ప్లే, డ్రైవ్ మోడ్, ఇల్యూమినేటెడ్ లోగోతోపాటు ట్విన్ స్పోక్ స్టీరింగ్ వీల్, ఫ్రంట్ పవర్ విండోస్, సేఫ్టీ కోసం రివర్స్ పార్కింగ్ సెన్సర్ 6–ఎయిర్ బ్యాగ్స్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రామ్ (ఈఎస్పీ) వంటి ఫీచర్లు ఉంటాయి. టాటా నెక్సాన్ మరింత స్పోర్టీ, మోడ్రన్‌గా ఉంటుంది. ఫ్రంట్‌లో న్యూ ఎల్ఈడీ డీఆర్ఎల్స్ స్ప్లిట్ హెడ్ ల్యాంప్ సెటప్, న్యూ డిజైన్డ్–మోర్ స్పోర్టీ లుకింగ్ బంపర్ కింద ఎల్ఈడీ హెడ్ ల్యాంప్స్ అమరుస్తారు. టాటా నెక్సాన్ రేర్‌లో 16–అంగుళాల డైమండ్ కట్ డ్యుయల్ టోన్ అల్లాయ్ వీల్స్, ఫుల్లీ కనెక్టెడ్ ఎల్ఈడీ టెయిల్ లైట్ (ఎక్స్ ఫ్యాక్టర్ టెయిల్ ల్యాంప్), వెల్ కం, గుడ్ బై పంక్షన్లు ఉంటాయి. ఆరు కొత్త రంగుల్లో టాటా నెక్సాన్ కారు లభిస్తుంది. ఫియర్ లెస్ పర్పుల్, క్రియేటివ్ ఓషియన్, ప్యూర్ గ్రే, ఫ్లేమ్ రెడ్, డేటోనా గ్రే, ప్రిస్టిన్ వైట్ రంగుల్లో అందుబాటులో ఉంటుందీ కారు. టాటా నెక్సాన్ ఫేస్ లిఫ్ట్ కారు టూ–స్పోక్, ఫ్లాట్ బాటం స్టీరింగ్ వీల్, డాష్ బోర్డు దిగువన టచ్ ప్యానెల్ హెచ్‌వీఏసీ యూనిట్, సెంటర్ లో న్యూ గేర్ సెలెక్టర్ వంటి ఆప్షన్లతో ఈ కారు మరింత లగ్జరీగా కనిపిస్తుంది. టాటా నెక్సాన్ 1.2 లీటర్ల త్రీ సిలిండర్ టర్బో చార్జ్‌డ్ పెట్రోల్ ఇంజిన్‌తో వస్తోంది. ఈ ఇంజిన్ గరిష్టంగా 118 హెచ్పీ విద్యుత్ వెలువరిస్తుంది. 1.5 లీటర్ల 4–సిలిండర్ డీజిల్ ఇంజిన్ గరిష్టంగా 113 హెచ్పీ విద్యుత్ వెలువరిస్తుంది. టాటా నెక్సాన్ వేరియంట్లను బట్టి నాలుగు వేర్వేరు ట్రాన్స్‌మిషన్ ఆప్షన్లలో లభిస్తుంది. 5–స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్, 6–స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్, 6–స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్ మిషన్, న్యూ 7–స్పీడ్ డీసీటీ, డీజిల్ ఇంజిన్ తోపాటు 6–స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్, 6–స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్ మిషన్ ఆప్షన్లలో లభిస్తుంది.

# క్రెడిట్ కార్డుకూ ఓ లెక్కుంది..




క్రెడిట్ కార్డుల వినియోగదారులు ఏటేటా పెరుగుతూపోతున్నారు. దీంతో వీరిని ఆకట్టుకునేందుకు అనేక బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు, స్మాల్‌ఫైనాన్స్ కంపెనీలు పోటీ పడుతున్నాయి. మార్కెట్‌లో లభిస్తున్న టాప్ క్రెడిట్ కార్డులను ఒక్కసారి పరిశీలిస్తే.. పభుత్వ రంగ బ్యాంక్ ఎస్బీఐతోపాటు ప్రధాన ప్రైవేట్ రంగ, విదేశీ బ్యాంకులు అందించే క్రెడిట్ కార్డులపై ఆకర్షణీయ క్యాష్‌బ్యాక్ ఆఫర్లు ఉంటున్నాయి. ఈ క్రెడిట్ కార్డుల వినియోగదారులు ఆన్‌లైన్ షాపింగ్‌పై, ఇంధన కొనుగోళ్లపై 5 శాతం వరకు క్యాష్‌బ్యాక్, అంతకుమించి క్యాష్ పాయింట్లను పొందవచ్చు.

**ఈ–కామర్స్ క్రెడిట్ కార్డులు**

ఈ–కామర్స్ లావాదేవీల కోసం కూడా వివిధ బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు రకరకాల క్రెడిట్ కార్డులను ఇస్తున్నాయి. వీటి వినియోగదారులు క్యాష్‌బ్యాక్‌తోపాటు, లాంజ్ యాక్సెస్, వార్షిక చార్జీలపై తగ్గింపు ప్రయోజనాలను అందుకోవచ్చు. అమెజాన్, బుక్‌మైషో వంటి సంస్థల నుంచి వోచర్లు తీసుకోవచ్చు. క్రెడిట్ కార్డుల వినియోగదారుల వినోదం కోసం ఉద్దేశించబడినవే ఈ కార్డులు. ఆయా బ్యాంకులు ప్రముఖ మల్టీప్లెక్స్‌ల్లో తమ కస్టమర్లకు ఉచిత టికెట్లు వచ్చేలా ఆఫర్లు ఇస్తున్నాయి. గిఫ్ట్ వోచర్లు, రివార్డు పాయింట్లనూ అందిస్తున్నాయి. ఇంధన కొనుగోళ్లపై ఈ ఫ్యూయల్ క్రెడిట్ కార్డు వినియోగదారులు లాభం పొందవచ్చు. వార్షిక వినియోగంపై రూ.5,000 వరకు ఆదా అయ్యేలా రకరకాల ప్లాన్లను అందుబాటులో ఉంచుతున్నాయి. పర్యాటకులకు ఇవి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. పర్యాటకులకు విమానాల్లో, ఏసీ రైళ్లలో వివిధ సౌకర్యాలను ఇవి అందిస్తాయి. ఈ క్రెడిట్ కార్డులను వాడేవారికి విదేశాల్లో చేసే ఖర్చులపై ప్రత్యేక రివార్డు పాయింట్లు అందుతాయి. విమానాశ్రయాల్లో లాంజ్ యాక్సెస్ కూడా ఉంటుంది.

**ఫైన్ డైన్–ఇన్ క్రెడిట్ కార్డులు**

హోటళ్లకు వెళ్లినప్పుడు ఈ ఫైన్ డైన్–ఇన్ క్రెడిట్ కార్డులు సౌకర్యవంతంగా, లాభదాయకంగా ఉంటాయి. అలాగే స్విగ్గీ తదితర ఫుడ్ ఆర్డర్ యాప్‌లలో ఆర్డర్లపై క్యాష్‌బ్యాక్‌తోపాటు వివిధ ఖర్చులపై రివార్డులు, బోనస్‌లను అందుకోవచ్చు. ఆయా బ్యాంకులు తమ వినియోగదారులకు క్లబ్ మెంబర్‌షిప్ క్రెడిట్ కార్డులను అందిస్తున్నాయి. విలాసవంతమైన క్లబ్బుల్లో ఏడాదిపాటు ప్రోత్సాహక సభ్యత్వాలనూ కల్పిస్తున్నాయి.

స్పోర్ట్స్

# ఢిల్లీ ఔట్



**క్యాపిటల్స్ ప్లేఆఫ్స్ ఆశలపై నీళ్లు చల్లిన బెంగళూరు**

**రాణించిన పాటిదార్, జాక్స్ ఐదో స్థానానికి ఆర్సీబీ**

ప్లేఆఫ్స్ రేసులో ముందంజ వేసి నాకౌట్ ఆశలు నిలుపుకోవాల్సిన కీలకపోరులో చేతులెత్తేసిన ఢిల్లీ క్యాపిటల్స్.. ఆ రేసు నుంచి తప్పుకున్నట్టే! ఆదివారం 'చిన్నస్వామి' వేదికగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)తో ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో ఢిల్లీ బంతితో పాటు బ్యాట్‌తోనూ తడబడి మూల్యం చెల్లించుకుంది. సమిష్టి ప్రదర్శనతో వరుసగా ఐదో విజయం అందుకున్న బెంగళూరు.. 6 విజయాలు 12 పాయింట్లతో ప్లేఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. బెంగళూరు: ఐపీఎల్–17 ప్లేఆఫ్స్ రేసులో ఉండాలంటే తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తప్పటడుగులు వేసి తగిన మూల్యం చెల్లించుకుంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా ఆదివారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు.. 47 పరుగుల తేడాతో ఢిల్లీని ఓడించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ.. రజత్ పాటిదార్ (32 బంతుల్లో 52, 3 ఫోర్లు, 3 సిక్సర్లు), విల్ జాక్స్ (29 బంతుల్లో 41, 3 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరుపులతో 20 ఓవర్లలో 187/9 పరుగులు చేసింది. ఛేదనలో ఢిల్లీ.. 19.1 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌట్ అయింది. అక్షర్ పటేల్ (39 బంతుల్లో 57, 5 ఫోర్లు, 3 సిక్సర్లు) ఆ జట్టును ఆదుకున్నాడు. ఆర్సీబీ బౌలర్లలో యశ్ దయాల్ (3/20), ఫెర్గూసన్ (2/23) రాణించారు. కామెరూన్ గ్రీన్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

**మిడిలార్డర్ జోరు**

ఆర్సీబీ సారథి ఫాఫ్ డుప్లెసిస్ (6) మరోసారి నిరాశపరచగా కోహ్లీ (13 బంతుల్లో 27, 1 ఫోర్, 3 సిక్సర్లు) దూకుడుగా ఆడినట్టే అనిపించినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేదు. 36 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన ఆర్సీబీని జాక్స్, పాటిదార్ ఆదుకున్నారు. ఢిల్లీ ఫీల్డర్లు ఈ ఇద్దరూ ఇచ్చిన క్యాచ్‌లను నేలపాలు చేయడం వారికి కలిసొచ్చింది. 29 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేసుకున్న పాటిదార్.. రసిక్ 13వ ఓవర్లో అక్షర్ పటేల్‌కు క్యాచ్ ఇవ్వడంతో 88 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఆఖర్లో గ్రీన్ (24 బంతుల్లో 32 నాటౌట్, 1 ఫోర్, 2 సిక్సర్లు) ధాటిగా ఆడాడు.

**ఢిల్లీ ఏ దశలోనూ..**

ఢిల్లీ ఆదినుంచే తడబడింది. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన డేవిడ్ వార్నర్ (1) నాలుగో బంతికే ఔట్ అయ్యాడు. జేక్ ఫ్రేజర్ (13 బంతుల్లో 27, 1 ఫోర్, 3 సిక్సర్లు) ఎప్పటిలాగే దూకుడుగా ఆడాడు. కానీ దురదృష్టవశాత్తూ యశ్ ఠాకూర్ 3వ ఓవర్ రెండో బంతికి రనౌట్ అయ్యాడు. పొరెల్ (2) ఫెర్గూసన్ చేతికి చిక్కాడు. కుశాగ్ర (2) ను సిరాజ్ ఎల్బీడబ్ల్యూ చేశాడు. దయాల్ 5వ ఓవర్లో 3 ఫోర్లు కొట్టి ఊపు మీద కనిపించిన షై హోప్ (29)ను ఫెర్గూసన్ వెనక్కి పంపాడు. ఢిల్లీ భారీ ఆశలు పెట్టుకున్న ట్రిస్టన్ స్టబ్స్ (3) రనౌట్ అవడంతో ఆ జట్టు 90 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి ఓటమిని ఖరారుచేసుకుంది. కానీ తాత్కాలిక సారథి అక్షర్ పటేల్ మెరుపులతో ఆ జట్టు ఓటమి అంతరం కొంత తగ్గింది.

**సంక్షిప్త స్కోర్లు**

బెంగళూరు: 20 ఓవర్లలో 187/9 (రజత్ 52, జాక్స్ 41, రసిక్ 2/23, ఖలీల్ 2/31) . ఢిల్లీ: 19.1 ఓవర్లలో 140 (అక్షర్ 57, షై హోప్ 29, దయాల్ 3/20, ఫెర్గూసన్ 2/23)

## చెన్నై సేఫ్

**కీలక మ్యాచ్‌లో రాజస్థాన్‌పై గెలుపు**

**సిమర్‌జిత్ సూపర్ బౌలింగ్ రుతురాజ్ కెప్టెన్ ఇన్నింగ్స్**

ఈ సీజన్‌లో పడుతూ లేస్తూ సాగుతున్న చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే).. ప్లేఆఫ్స్ చేరాలంటే తప్పక రాణించాల్సిన మ్యాచ్‌లో జూలు విదిల్చింది. తమ సొంత డెన్ చెపాక్‌లో సిమర్‌జిత్ సూపర్ బౌలింగ్‌తో రాజస్థాన్‌ను తక్కువ స్కోరుకే కట్టడిచేసిన రుతురాజ్ సేన.. ఆ తర్వాత స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో తడబడ్డా చివరికి గమ్యాన్ని ముద్దాడింది. ఈ గెలుపుతో చెన్నై.. ఏడు విజయాలతో 14 పాయింట్లు సాధించి పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి దూసుకెళ్లింది. ఐపీఎల్–17లో ఒడిదొడుకుల మధ్య సాగుతున్న డిఫెండింగ్ చాంపియన్ సూపర్ కింగ్స్.. ప్లేఆఫ్స్ రేసులో నిలిచేందుకు రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన అత్యంత కీలకమ్యాచ్‌లో సమిష్టి ప్రదర్శనతో అదరగొట్టింది. చెపాక్ వేదికగా ఆదివారం ముగిసిన మ్యాచ్‌లో రాజస్థాన్‌ను 5 వికెట్ల తేడాతో ఓడించి ప్లేఆఫ్స్ బెర్తును పదిలం చేసుకుంది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' సిమర్‌జిత్ సింగ్ (3/26) ధాటికి రాజస్థాన్ టాపార్డర్ కుప్పకూలడంతో ఆ జట్టు 20 ఓవర్లలో 5 వికెట్లకు 141 పరుగులకే పరిమితమైంది. రియాన్ పరాగ్ (35 బంతుల్లో 47 నాటౌట్, 1 ఫోర్, 3 సిక్సర్లు) రాణించాడు. స్వల్ప ఛేదనే అయినా చెన్నై కూడా ఛేదనలో తడబాటుకు లోనైంది. రుతురాజ్ గైక్వాడ్ (41 బంతుల్లో 42 నాటౌట్, 1 ఫోర్, 2 సిక్సర్లు) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆ జట్టు 18.2 ఓవర్లలో లక్ష్యాన్ని పూర్తిచేసింది.

**సిమర్‌జిత్ సూపర్..**

చెపాక్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ ఇన్నింగ్స్‌ను నెమ్మదిగానే ఆరంభించింది. ప్రమాదకర బట్లర్ (21), జైస్వాల్ (24) క్రీజులో ఉన్నా పవర్ ప్లేలో ఆ జట్టు 42 పరుగులే చేయగలిగింది. ఏడో ఓవర్లో బంతిని అందుకున్న సిమర్‌జిత్.. రెండో బంతికే జైస్వాల్‌ను ఔట్ చేసి చెన్నైకి బ్రేక్ ఇచ్చాడు. తన రెండో ఓవర్లో బట్లర్‌ను బోల్తా కొట్టించిన సిమర్‌జిత్.. 15వ ఓవర్లో శాంసన్ (15) ను పెవిలియన్‌కు పంపాడు. మిడిల్ ఓవర్స్‌లో రాజస్థాన్ బ్యాటర్లు పరుగులు తీయడానికి నానా తంటాలు పడ్డారు. తీక్షణ, జడేజా, శార్దూల్ ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడిచేశారు. చివర్లో పరాగ్, ధ్రువ్ జురెల్ (18 బంతుల్లో 28, 1 ఫోర్, 2 సిక్సర్లు) మెరుపులతో రాజస్థాన్ ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది.

**చెన్నై కష్టంగానే..**

స్వల్ప ఛేదనను పూర్తిచేయడానికి చెన్నై కూడా తంటాలు పడింది. ఆరంభంలో రచిన్ రవీంద్ర (18 బంతుల్లో 27, 1 ఫోర్, 2 సిక్సర్లు) దూకుడుగా ఆడినా అశ్విన్ వేసిన 3వ ఓవర్లో అతడికే క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మిచెల్ ఉన్నది కొద్దిసేపే అయినా బౌండరీలతో మెరుపులు మెరిపించి చాహల్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. ఆ తర్వాత నుంచి సీఎస్‌కే స్కోరు వేగం మందగించింది. మోయిన్ అలీ (10)తో పాటు రుతురాజ్ కూడా పరుగులు తీయడానికి ఇబ్బందిపడ్డారు. అశ్విన్ వేసిన 14వ ఓవర్లో 6, 4, 4 బాదిన దూబే (18) అదే ఓవర్లో ఆఖరి బంతికి రియాన్ పరాగ్ చేతికి చిక్కాడు. జడేజా (5) అబ్‌స్ట్రక్టింగ్ ది ఫీల్డ్ రూపంలో పెవిలియన్ చేరడంతో చెన్నై శిబిరంలో ఒకింత అలజడి రేగింది. కానీ రుతురాజ్ అండతో రిజ్వీ (8 బంతుల్లో 15 నాటౌట్, 3 ఫోర్లు) లాంఛనాన్ని పూర్తిచేశాడు.

## పర్వేజ్ ఖాన్‌కు స్వర్ణం



ఫ్లోరిడా: భారత యువ అథ్లెట్ పర్వేజ్ ఖాన్ ఫ్లోరిడావేదికగా జరుగుతున్న సౌత్‌ఈస్ట్రన్ కాన్ఫరెన్స్ ఔట్‌డోర్ ట్రాక్ అండ్ ఫీల్డ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచాడు. పురుషుల 1500 మీటర్ల రేసును పర్వేజ్.. 3 నిమిషాల 42.73 నిమిషాల్లోనే పూర్తిచేసి పసిడి నెగ్గాడు. హర్యానాలోని మేవాత్ జిల్లా చహల్క గ్రామంలో వ్యవసాయ కుటుంబానికి చెందిన 19 ఏండ్ల కుర్రాడు.. ఇదే టోర్నీ 800 మీటర్ల రేసులో కాంస్యం సాధించాడు.



# ఆవేశం' అందుకే అంతపెద్ద హిట్!

మలయాళంలో ఫహాద్ ఫాజిల్ కి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవలసిన పనిలేదు. ఆయన తాజా చిత్రంగా ఏప్రిల్ 11వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'ఆవేశం' బ్లాక్ బస్టర్ హిట్ కొట్టింది. జీతూ మాధవన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, కేవలం 30 కోట్ల రూపాయల బడ్జెట్ లో రూపొందింది. అయితే చాలా వేగంగా ఈ సినిమా 150 కోట్ల క్లబ్ లో చేరిపోయింది. అలాంటి సినిమా ఇప్పుడు అమెజాన్ ప్రైమ్ లో మళయాళంలోనే స్ట్రీమింగ్ అవుతోంది. కథలోకి వెళితే .. ఓ ముగ్గురు స్నేహితులు ఏరోనాటికల్ ఇంజనీరింగ్ చేయడానికి కేరళ నుంచి బెంగుళూర్ వెళతారు. అక్కడి సీనియర్ స్టూడెంట్స్ ఈ ముగ్గురిని చాలా దారుణంగా ర్యాగింగ్ చేస్తారు. సీనియర్స్ కి తగిన గుణపాఠం చెప్పాలనే ఉద్దేశంతో, లోకల్ రౌడీ రంగాను ఈ ముగ్గురు ఫ్రెండ్స్ ఆశ్రయిస్తారు. రంగా ఆ సీనియర్స్ ను తనదైన స్టైల్లో భయపెడతాడు. దాంతో రంగా తాలూకు మనుషులుగా కాలేజ్ లో ఈ ముగ్గురు ఫ్రెండ్స్ కి పేరు పడుతుంది. మొదట్లో అదో గొప్ప విషయంగా అనిపించినా, ఆ తరువాత అదే వారిని ఇబ్బంది పెట్టడం మొదలెడుతుంది. రంగాకి ప్రేమ ఎక్కువైనా .. కోపం ఎక్కువైనా అది తీవ్ర రూపం దాలుస్తుంది. అతనిలోని ఆ ధోరణి ఈ ఫ్రెండ్స్ ను ఎలా తిప్పలు పెట్టిందనేదే కథ. మొదటి నుంచి చివరివరకూ నాన్ స్టాప్ నవ్వులు కురిపించడాం వల్లనే ఈ సినిమా ఈ స్థాయి హిట్ కొట్టిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



# పూజా హెగ్డే సరికొత్త ప్రయాణం

అతి తక్కువ సమయంలో తెలుగునాట అగ్ర కథానాయికగా గుర్తింపు పొందింది పూజాహెగ్డే టాలీవుడ్‌లో అగ్ర హీరోలు అందరితో యాక్ట్ చేసింది. అయితే 'గుంటూరు కారం' చిత్రంలో అవకాశం మిస్ అయిన తర్వాత తెలుగులో మరో అవకాశం దక్కలేదు. తమిళంలో బాగానే సినిమాలు చేసింది. బాలీవుడ్‌లోనూ బిజీగా ఉంది. గతేడాది 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్' చిత్రంతో అలరించిన ఈ బెంగళూరు బ్యూటీ ఇప్పుడు వరుస చిత్రాలతో బిజీగా కావడానికి రంగం సిద్ధం చేసుకుంటోంది. అహాన్ శెట్టితో కలిసి నటిస్తున్న చిత్రం 'సంకీ' అద్నాన్ షేక్, యాసిర్ రూ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణను వచ్చే నెలలో ప్రారంభించనున్నట్లు సమాచారం. ఈ సినిమాతో పూజా హెగ్డే సరికొత్త ప్రయాణం ఆరంభం కానుంది. జూన్‌లో షూటింగ్‌ను మొదలు పెట్టనున్నారు. ఇందులో భాగంగా ఈ సినిమాకు కీలకమైన యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. దీని కోసం ముంబయిలో భారీ బడ్జెట్‌తో సెట్‌ను సిద్ధం చేసింది చిత్రబృందం. ఇందులో అహాన్, పూజ మధ్య కెమిస్ట్రీ సినిమాకే స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలవనుంది.' పూజాహెగ్డే సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ప్రేమకథ ఇతివృత్తంగా సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.




## మంచు విష్ణు లుక్ వైరల్

టాలీవుడ్ యాక్టర్ మంచు విష్ణు నటిస్తోన్న తొలి పాన్ ఇండియా చిత్రం కన్నప్ప విష్ణు టైటిల్ రోల్‌లో నటిస్తున్న ఈ చిత్రానికి బాలీవుడ్ దర్శకుడు ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీలో గ్లోబల్ స్టార్ ప్రభాస్, కలెక్షన్ కింగ్ మోహన్‌బాబు, మోహన్ లాల్, నయనతార, మధుబాల, శరత్‌కుమార్, శివరాజ్‌కుమార్ కీ రోల్స్ పోషిస్తున్నారు. కాగా ఈ మూవీ నుంచి ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ రాబోతుందంటూ విష్ణు ఇప్పటికే ఓ వార్తను అందరితో షేర్ చేశాడు. ఆ వార్త ఏంటో కాదు టీజర్ అప్‌డేట్. కన్నప్ప టీజర్‌ను కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో గ్రాండ్‌గా లాంఛ్ చేయబోతున్నారు. మే 20వ తేదీన కన్నప్ప ప్రపంచాన్ని మీకు చూపించేందుకు వేచి ఉండలేకపోతున్నాను. కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో కన్నప్ప టీజర్‌ను లాంఛ్ చేస్త్ముమని ప్రకటించారు. విష్ణు చేతిలో ఖడ్గం పట్టుకొని సమరంలో ఉన్న పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. క్లాస్, మాస్, యాక్షన్ హీరోగా పాపులారిటీ సంపాదించిన బాలీవుడ్ యాక్టర్ అక్షయ్‌కుమార్ కన్నప్పలో కీలక పాత్రలో నటిస్తున్నాడని తెలిసిందే. ఈ చిత్రానికి మెలోడీ బ్రహ్మ మణిశర్మ, స్టీఫెన్ దేవసి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సమకూరుస్తున్నారు. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, బ్యానర్లపై భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ మూవీకి పరుచూరి గోపాలకృష్ణ, బుర్రా సాయిమాధవ్, తోట ప్రసాద్ స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు.



# బిజీబిజీగా రష్మిక

కన్నడ సోయగం రష్మిక మందన్న తారాపథంలో దూసుకుపోతున్నది. తెలుగు, హిందీ, తమిళ భాషల్లో వరుసగా భారీ సినిమాలతో బిజీబిజీగా మారింది. మరో ఏడాది పాటు ఈ అమ్మడి డేట్స్ ఖాళీ లేవు అంటున్నారు. ప్రస్తుతం రష్మిక చేతిలో ఆరు సినిమాలున్నాయి. వీటి షూటింగ్స్ మొత్తం పూర్తి కావడానికి ఏడాదికిపైగా సమయం పడుతుందంటున్నారు. దాంతో ఈ భామ డేట్స్ కావాలంటే మరో ఏడాది పాటు ఆగాల్సిందే. ప్రస్తుతం రష్మిక మందన్న తెలుగులో పుష్ప-2, రెయిన్‌బో, గర్ల్‌ఫ్రెండ్, కుబేర చిత్రాల్లో నటిస్తున్నది. 'పుష్ప-2' చిత్రీకరణ తుదిదశకు చేరుకోగా..మిగిలిన మూడు చిత్రాలు షూటింగ్స్ జరుపుకుంటున్నాయి. ఇక బాలీవుడ్‌లో 'యానిమల్' బ్లాక్‌బస్టర్ విజయంతో ఈ సొగసరికి అవకాశాలు వెల్లువెత్తున్నాయి. 'సికిందర్' సినిమాలో సల్మాన్‌ఖాన్‌తో జోడీ కట్టబోతున్నది. విక్కీకౌశల్‌తో 'ఛావా' సినిమాలో నటిస్తున్నది. హిందీలో మరికొన్ని ఆఫర్లొచ్చినా..డేట్స్ ఖాళీలేని కారణంగా రష్మిక అంగీకరించలేదని అంటున్నారు. మొత్తంగా చూస్తే మరో ఏడాది పాటు రష్మిక మందన్న డేట్స్ దొరకడం కష్టమేనని ఫిల్మ్‌సర్కిల్స్‌లో వినిపిస్తున్నది.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com